# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ : (0863) 2293280, 2293206

web: www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము

గూడూరి వెంకటరత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ ఎస్.రామతారక పరబ్రహ్మశాస్త్రి

మిస్.పి. ఇందిరాదేవి

డా॥ వి.వి.ఆర్. ప్రసాదరావు

డా॥ యమ్.స్వర్ణముఖి

Volume 30 Issue 10

No.of Pages 40

JUNE 2011

| | | |
|---|---|---|
| 5సం॥ల చందా | రు. | 250.00 |
| 2సం॥ల చందా | రు. | 120.00 |
| సంవత్సర చందా | రు. | 60.00 |
| విడిప్రతి వెల ..... .. | రు. | 5.00 |

బ్యాంక్ డ్రాఫ్ట్ A/C.Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరులో డ్రా చేయండి. M.O.,బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా:

మేనేజరు

సమర్థసద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్-522508

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

## ఈ సంచికలో.... పేజీ

| ఈ సంచికలో.... | పేజీ |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| అమ్మఆశీస్సులు | 3 |
| బాబూజీ ఉవాచ | 4 |
| మాతాజీ అభిభాషణ | 7 |
| సన్నిధిలో సంభాషణ | 11 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 14 |
| శ్రీలల్లాదేవి | 15 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 19 |
| పరిప్రశ్నేన సేవయా | 21 |
| శ్రీబాబూజీ దివ్యవాణి | 23 |
| సమర్థ సద్గురు నాథుని దివ్యచరిత్ర | 25 |
| గిరిజా విజయం | 27 |
| శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాదబాబు ఆవాస గురుకులం | 29 |
| కనువిప్పు | 30 |
| శాంతి ధామం - ఆశ్రమం | 32 |
| మౌనధ్యాన సప్తాహ శిబిరం | 34 |
| శ్యామసుందరా! ఒక్కసారి! | 36 |
| వార్తలు - విశేషాలు | 39 |

# భద్రవాక్యం

-పరాశర ప్రసాద్

**అనేజదేకం మనసో జవీయో**
**నైనద్దేవా ఆప్నువన్ పూర్వమర్షత్।**
**తద్ధావతో న్యాన త్యేతి తిష్ఠత్**
**తస్మిన్నపో మాతరిశ్వా దధాతి॥**

బ్రహ్మ పదార్థం సృష్టికి ముందూ ఉంది, వెనుకా ఉంది. లోపలా ఉంది, బయటా ఉంది. సర్వత్రా వ్యాప్తమై ఉన్న ఈశ్వరుడు లేని దెక్కడ? ఆ దైవాన్ని పట్టుకోవటానికి మనస్సు ఎంత వేగంగా పరుగిడినా పట్టుకో గల్గుతుందా!

కదలిక అనేది జీవుడు చేసే పని. ఈశ్వరునికి కదిలేందుకు స్థలమెక్కడిది? ఆయనకి దేశకాలాలు లేవు. అవన్నీ ఆయనలో ఇమిడి ఉన్నవే. సృష్టిలో చైతన్యం తనను తాను మాయావరణ చేసుకుని దాగి ఉంది.

మనకు సృష్టిగా కనిపిస్తున్నందతా మనస్సు కల్పితమే. మహాత్ములు నా స్వరూపం ఇది అని ఒకసారి రుచి చూపించి మెరుపులాగా కనిపించి అదృశ్యమవుతారు.

రుచి మరగిన సాధకుడు తనలో విశ్వంలో రుచి మరగిన దానిని వెతుక్కోవటమే సాధన అనవచ్చు.

మనస్సు అనంతం. అంతటా వ్యాపించింది. మనస్సులో వ్యష్టి భావన తీసివేసి సంపూర్ణ శరణాగతి పొందితే మనస్సు ఆత్మయందే లయిస్తుంది. ఇది మహాత్ముల వాక్కు సత్యం కాక మరేమిటి?

*

# అమ్మ ఆశీస్సులు

**యస్యకృపా కటాక్షేన సంసారోఽయం ప్రణశ్యతి ।**
**సర్వగం సచ్చిదాత్మానం తం వన్దే పార్థ సారథిమ్ ॥**

ఎవరి కృపాకటాక్షము చేత ఈ సంసార దుఃఖము నశించి, పోవునో, అట్టి సర్వవ్యాపకుడు, సచ్చిదానంద ఆత్మస్వరూపుడు, అర్జున సారథి అయిన శ్రీకృష్ణపరమాత్మకు నమస్కారము.

ఈ పార్థసారథియైన పరమాత్మ మనందరికీ సారథియై ఉన్నాడు. రథికుడు ఏది ఎట్లు ఎలా చేయాలనుకుని ఆచరిస్తున్నాడో. వెనుక తన పరమాత్మ ఆధారము లేనినాడు తనువు ఎక్కడిది? ప్రాణమెక్కడిది? సర్వజీవనాధారుడై జగత్తులో చేతనాచేతనములను ప్రకాశింప జేస్తున్న అద్వైత సామ్రాజ్య చక్రవర్తి.

శ్రీకృష్ణ అవతారమునందు పార్థసారథియై ప్రసాదించిన బోధ ఆనాటి నుండి ఈనాటి వరకు అవతారములను అనేకముగా ప్రసాదిస్తూ తత్త్వ బోధ మాత్రం మార్పులేకుండా అందరికీ Universal sprit నిస్తుంది.

ఒకే ఒక సత్యము సర్వవ్యాపకము **"ఏకం సత్ విప్రాః బహుధా వదంతి"** అసత్యమనే యీ జగత్తుకంతటికీ మూలమై ఉన్నది. శ్రీగురుదేవులు తమ బోధామృతమునందు చెబుతూ ఉండేవారు.

అసత్యములోనే సత్యము దాగి ఉన్నది. అట్టి సత్యమే మనని సత్యమార్గంలో నడిపించటం కొరకు సద్గురువులుగా అవతరించి సత్యము యొక్క తత్త్వమును మనకు బోధ నందించి, ద్వంద్వములు అనే బాధ నుండి తరింపచేస్తున్నారు.

ఇక మనము అట్టి సద్గురువులను ఆశ్రయించినందుకు, మనని నమ్మి ఆశ్రయ మిచ్చినందుకు సార్థకతను చేసుకోవాలి. ఇదే సర్వసమర్పణ, చేస్తే శ్రీసద్గురుదేవులు మనలో ఉన్న సత్యస్వరూపమే. అట్టి శ్రీజగద్గురుదేవుల ఆశీస్సులు సర్వదా మనపై వర్షించుగాక!

శ్రీసద్గురు సేవలో
మీ అమ్మ

# బాబూజీ ఉవాచ

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

రాధ తన మనస్సును పరమాత్మయందు అలాగే నిలపగలిగింది. 'రాధ' అనే మాటను తిరగేసి పలికితే 'ధార' అవుతుంది. అవిచ్ఛిన్నమైన తైలధారవలె తన మనస్సులో ఎడతెరిపి లేకుండా పరమాత్మను ధారణ చేసింది రాధ. కనుకనే ఆ పరంధాముని పొందగలిగింది. తన స్వంతం చేసుకోగలిగింది. అలాగే గోపికలు కూడా, మూడవస్థల యందు, ప్రక్కలో భర్త ఉన్నాసరే, కృష్ణా, కృష్ణా అని ఆయన్ను పట్టుకునే పలవరిస్తూ ఉండేవారు. "ప్రభూ! నీ స్మరణ, నీ ధ్యానము, నీ రూపము సదా నా మనస్సులో



నిలిచిపోవాలి" అని ప్రార్థించేవారు. జాగ్రదవస్థలో పాలు పితుకుతున్నపుడు కూడా "కృష్ణా, కృష్ణా" అని తన్మయత్వంలో ఉన్నందు వలన గోవులు కూడా రెట్టింపు పాలు యిచ్చేవి. అలా భగవన్నామంతో ఏ పని చేసినా రెట్టింపు లాభం కలుగుతుంది.

కృష్ణ పరమాత్మ ఉద్భవించి నందు వలన యాదవులు ఎంతో సుఖశాంతులతోను, అంతులేని ఐశ్వర్యంతోను తులతూగారు. కాని వారిలో రానురాను అహంకారం పెరిగిన కొంతమంది దిగజారిపోయి చివరకు పతనమైనారు.

బృందావనంలో జరిగిన రాసలీలలో శ్రీకృష్ణుడు అనేక మంది గోపికలతో తానొక్కడే క్రీడించాడని, అది యింద్రియ సుఖం అని అంటారు అవివేకులు. ఏడు సంవత్సరాల ప్రాయంలో ఉన్న బాలుడు అనేక మందితో యింద్రియ సుఖాన్ని ఏకకాలంలో పొందాడని భావించటం కన్న అవివేకం ఏముంది? నిజానికి ఆ క్రీడ కృష్ణునికి, గోపికలకు మధ్య మాత్రమే జరిగినది కాదు, కేవలం ఆ సమయంలోనే జరిగినదీ కాదు, కేవలం బృందావనంలోనే జరిగినదీ కాదు, అది పరమాత్మకు సకల జీవరాసులకు, జడ ప్రకృతిలోని అన్ని వస్తువులకు అణువణువున అనుక్షణం నిర్విరామంగా నిత్యమూ జరిగే ఆత్మరతి. అణువణువున నిండి ఉన్న ఆత్మ వస్తువుతో ప్రకృతి జరిపే నిత్య

చైతన్య క్రీడ. ఆ క్రీడ నిలిచిన మరుక్షణం సర్వనాశనము, సర్వ శూన్యమే. దయానిధి, భక్తవత్సలుడు, ప్రేమమూర్తి అయిన ఆ శ్యామసుందరుడు అన్న మాటలో ఆత్మానందము యిమిడి ఉంది. మేఘము ఉన్న చోటనే చల్లదనము ఉంటుంది. ఆయన ఉన్న చోట సర్వత్రా చల్లదనమే, ఆనందమే.

లీల అనే గోపిక ఉండేది. కృష్ణ పరమాత్మ నీలమేఘచ్ఛాయుడు; ఆమె కాస్త ఛాయ గలది. కాని మూగ. నాకూ నంగీ, మూగా ఉండేవి(బాబు). ఇప్పుడు లేవనుకోండి. అయినా, అప్పుడూ యిప్పుడూ కూడా, ఎందరిలో ఉన్నా, ఏ సమస్య వచ్చినా, నాతో సత్యవాక్కు పలికించి, గెలుపు నాకే అందిస్తున్నది కరుణామయి అయిన మా అమ్మ.

లీల చాలా భక్తురాలు. కృష్ణుని గురించి తోటి గోపికలు తనతో చెబుతుంటే "ఆ రూపాన్ని ఎప్పుడు చూడగలుగుతాను? ఆ దివ్య గానం చెవులార ఎప్పుడు వినగలుగుతాను? ఆయన నామం ఎంతో మధురమైనది. ఏనాటికయినా "కృష్ణా" అనే తియ్యని పిలుపుతో ఆ స్వామిని నోరారా పిలుచుకోగలనా? ఆ భాగ్యము నాకు లభిస్తుందా?'' అని ఆవేదన పడేది. ఆయన దర్శనం కోసం ఆరాటపడేది. ఆ రూపము దర్శించగలిగిన వారిదే అదృష్టము. కృష్ణుడు ప్రతిరోజు వాళ్ళ వీధి గుండా వెళ్ళేవాడు గాని కనపడలేదు. ఆ Time రాలేదు. ఆమె ఆవేదన తపస్సుగా మారింది. ఆమె గది తపోవనంగా మారింది. పరమాత్మ అనుగ్రహం ఆమెపై కలిగింది. ఆ రోజు వాళ్ళ వీధి గుండా వస్తూ, వాళ్ళ యింటికి ఫర్లాంగు దూరంలో ఉండగానే మురళీగానం ప్రారంభించాడు కన్నయ్య. ఆ గానము పక్షులకు, పాములకే గాక వృక్షాలకు, శిలలకు కూడా ఆనందాన్ని యిచ్చి మైమరపించేది. ఆ గానం విని లీల బయటకు వచ్చి స్వామిని దర్శించింది.తన్మయత్వంలో బొమ్మవలె ఆయనను అనుసరించి యమునా తటాకానికి వెళ్ళింది. అక్కడ ఒక గున్నమామిడి చెట్టు క్రింద కూర్చున్నాడు స్వామి. లీల చాలాసార్లు అనుకునేది "కృష్ణ ప్రభువు ఒడిలో పడుకుని, ఆయన కళ్ళలోకి చూస్తూ, ఆ దివ్యదర్శన ఆనందాన్ని ఏనాడైనా పొందగలుగుతానా?'' అని. ఆ మహాభాగ్యం యీనాడు లభించింది.

లీల హృదయంలోని భావనను అంతర్యామి అయిన కృష్ణ భగవానుడు గ్రహించాడు. ఆ చెట్టు నానుకుని కూర్చుని మురళీగానం చేస్తూ ఒక క్రీగంటి చూపును లీలపై ప్రసరింపజేశాడు. సూర్యోదయం వల్ల మంచు పటాపంచలైనట్లు, ఆ క్రీగంటి చూపుతో లీల అజ్ఞానం హరించి మాయ తొలగిపోయింది. ఆ

స్వామి ఒడిలో వాలిపోయింది. ఆ స్పర్శ తగలగానే తనలోని గుణములు, వాసనలు అన్నీ హరించి, ఆమె ఆనంద సమాధిలోకి వెళ్ళిపోయింది.

స్వామి ఆప్యాయంగా ఆమె తల నిమురుతూ "లీలా! నన్ను పేరుతో పిలిచి పలకరించవా?" అన్నాడు. ఆమె వెంటనే "కృష్ణా! వాసుదేవా! ప్రభూ! ఇక నన్ను వదలకు సుమా! ఎంత ప్రేమ స్వరూపుడవు! మాటలు రాని యీ మూగదానికి నీ నామంతోనే మాటలు ప్రసాదించావా! నేను సామాన్యురాలిని, బీదదాన్ని, జీవకోటికి చెందిన దానిని. నీవు భగవానుడవు, ఇట్టి ఆనందమును నాకు కలిగించిన కరుణామయుడవు." అని ఆనందముతో అన్నది. ఆమెకు వెలలేని అచంచల భక్తిని భగవానుడు ప్రసాదించాడు. "ఇకనుంచి నీ నామము తప్ప నా నోటి వెంట మరొక శబ్దము రాకుండా వరమిచ్చి, నాకు లభించిన యీ వాక్కు సార్థకం చేసుకునేటట్లు అనుగ్రహించు ప్రభూ" అని వేడుకున్నది. "అలాగే లీలా! ఎన్నో జన్మల నుంచి నీవు నా తపస్సు చేశావు. ఈ జన్మలో నీవు నా స్మరణతో నా యందు లయించి తరించగలవు" అని శ్రీకృష్ణ పరమాత్మ అనురాగమయమైన తన మృదు కర స్పర్శతో లీల తల నిమురుతూ ఆమెను ఆశీర్వదించాడు.

రాధ స్నేహితురాండ్రలో చంద్ర అనే అమ్మాయి ఉండేది. బాగా పెంకెఘటం. రాధకు కృష్ణుని యెడల అనన్యమైన భక్తి ఉండేది. కృష్ణుని కోసం తన తను, మనో, ధన, ప్రాణాలను సైతం అర్పించి, లోకులు తనను స్వైరిణి అని నిందించినా లెక్కచేయక కృష్ణుణ్ణి సేవించుకునేది. కృష్ణుని తోడిదే లోకంగా భావించేది. చంద్ర ఈ విషయంలో రాధను విమర్శించేది, నిందించేది. కృష్ణుని కూడా రాధ వద్ద నిందించేది. కాని రాధ చలించలేదు. "ప్రభూ! ఎవరెన్ని అన్నా, నీ చరణ కమల ధ్యానం నుండి మాత్రం నన్ను వేరు చేయకు. నాలో మాయను ప్రవేశించనీయకు" అని దీనంగా ప్రార్థించేది. చంద్రతో "చూడు చంద్రా! ఆ మహనీయుని ప్రేమామృతపు రుచిని నీవెరుగవు. కాని ఒకసారి అది రుచి చూస్తే యిక ప్రాణాలకైనా తెగించి ఆయనను ఆరాధిస్తావు" అనేది. కాని చంద్ర "ఆ మోసగాని వలలో నీవంటి వెర్రిబాగుల వాళ్ళు పడవలసిందే గాని నేను ఎన్నటికి అతని మాయలో పడను" అనేది.

-సశేషం

# మాతాజీ అభిభాషణ

(గత సంచిక తరువాయి) -జపమాల ప్రసాద

సర్వజ్ఞులైన గురుదేవులకి తెలియనిదేమిటి? తమ మిగతా శిష్యుల కపటము నెరిగి, అజ్ఞాన్‌ని పిలిచి, "ఏరా అజ్ఞాన్! నీకు మాతో పాటు కాశీకి వెళ్ళాలని లేదా? గంగాస్నానం, కాశీవిశ్వనాధుని దర్శనం వద్దా?" అని అడిగేసరికి, అజ్ఞాన్ "గురుదేవా! నన్నింకా పరీక్ష చేస్తున్నారా? నా ప్రత్యక్ష విశ్వేశ్వరుడిని నేనెప్పుడూ చూస్తూనే వున్నాను. ఆయనెప్పుడూ నా దగ్గరే వున్నాడు. అటువంటప్పుడు నేనెక్కడో దూరం వెళ్ళాలా?" అని తన గురుదేవుల పాదాలని పళ్ళెంలో పెట్టుకొని, చక్కగా నీటితో ప్రక్షాళన చేసి, ఆనీటిని తన శిరస్సుపై జల్లుకుని ఆనంద తన్మయత్వం చెందాడు. "ప్రభూ నేను ఎక్కడికో దూరం వెళ్ళనక్కరలేకుండా, డబ్బు ఖర్చులేకుండా, ఏ ఆయాసమూ లేకుండా, అసలు ఇతర చింతన అనేది లేకుండా, జన్మ జన్మాంతరాలనుండీ వస్తున్న వాసనలను హరించే నా గురుపాద తీర్థముండగా, నాకు ఎంతటి సౌభాగ్యం!" అని ఆనంద పరవశుడైపోతాడు అజ్ఞాన్.



గురుసేవ అంత గొప్పది. మీరు కూడా అలా సంపూర్ణంగా ఆస్వాదించండి. ప్రపంచం అంతా ఒక ఎత్తు. గురుపాద తీర్థంలోని సహస్రాంశం బిందువు ఒక ఎత్తు. గురుదేవులకీ, వారి మాటకీ విడదీయడానికి లేదు. భగవద్గీతకి, గీతా వాక్యానికి, దీపానికి దాని కాంతికి, మహాత్ములకి వారి వాక్కుకి విడదీయడానికి వీలులేదు. మహాత్ములకి ఎంత విలువ నిస్తున్నామో, వారి వాక్కుకి కూడా అంతే విలువ ఇవ్వాలి. వారికెంత దాస్యం చేస్తున్నామో, వారివాక్కుకి కూడా సర్వస్వం దాస్యం చేయాలి. ఆ విధంగా చేశాడు కనుకనే, అజ్ఞాన్ అంతటి గొప్ప భక్తుడయ్యాడు. 'అ' అంటే బ్రహ్మబీజం. కేవలం గురుశుశ్రూష వల్ల బ్రహ్మజ్ఞానాన్ని పొందినవాడు అయ్యాడు అజ్ఞాన్. అంతేకాదు, ఆ పిల్లవాడు సీతారామ, లక్ష్మణహనుమంతుల చేత కూడా సేవ చేయించుకుంటాడు.

కానీ అటువంటి గొప్ప స్థితిని పొందనీయకుండా ఈ మాయ ఏం చేస్తోంది అంటే, దారా పుత్రులు, ధనధాన్యాలు అనే వాటినన్నింటినీ తెచ్చి పెడుతోంది. ఒక వేళ సంసారాన్నీ, బంధుమిత్రులని విడిచివున్నా, 'మేము కనుక వీటినన్నింటినీ విడిచివున్నాం' అని అనుకున్నా చాలు - అది మళ్ళీ బంధంలోకి తోసేస్తుంది!

'నిష్ఠ' అంటే ఎలా వుంటుందో, ఇక్కడ కూర్చున్న మహాత్ములని చూస్తే మీకు తెలుస్తుంది. అన్నిటినీ వదిలిపెట్టినవారు, శరీరావస్థ బాగుండకపోయినా ఎలా కదలకుండా కూర్చున్నారో! వారు వినాలని ఏముంది? కానీ వారు నడచి మనని నడిపిస్తున్నారు ఆ మహాత్ములు. అదే 'నిష్ఠ' అంటే. బ్రహ్మజ్ఞాన సంపన్నులేం చెప్పారంటే, "మీరు సన్మార్గంలో నడుస్తూ, ఇతరులని నడిపించండి. అప్పుడు వారు బాగా నడుస్తారు. మీరు నడవకుండా, 'చెప్పడం మా వంతు; వినడం మీ వంతు; అంటే కడుపునిండదు''. మేము ఆచరించకుండా మీరు చేయండి అంటే ఎలా కుదురుతుందండీ? అందుకే, స్వయం తీర్ణాః పరాం తారయంతి' అన్నారు. ఈ మహాత్ములు, "మేము రెస్టు తీసుకుంటాం, మీరు కార్యక్రమం జరిపించండి'' అని అనటం లేదు. వారలా చేస్తే, మనకి తృప్తి వుండదు. మహానుభావుల అనుగ్రహం అలా వుంటుంది. వారు దేహాన్ని చూసుకోవటం లేదు. లోపల మనసు ఆనంద తాండవం చేస్తూ పరుగులు పెడుతోంది కనుక వారికి చింతలనేవే లేవు. అందుకనే వారెప్పుడూ ఆనందంగానే ఉంటారు.

ఈ ప్రపంచంలోని ధనధాన్యాలు, ఘన బిరుదాలు అన్నీ కూడా ఆ మాయ యొక్క గారడీయే. వాటిల్లో పడితే యిక మన పని అంతే. మనకేమీ తెలియదనుకోవడం కూడా ఒక మాయే. తెలియకపోతే తెలుసుకో. ఇకపోతే, నాకన్నీ తెలుసు అని అనుకోవడం ఇంకా గొప్పమాయ. నిజంగా అన్నీ తెలిసున్నవాడు, 'నాకుతెలుసు' అని చెప్పుకోనే చెప్పుకోడు. మహాత్ముల యొక్క గొప్పదనం వారియొక్క ముఖకాంతులు, ఆచరణ పద్ధతులలో ప్రస్ఫుటమవడమేకాక, మనని నవనీతంలా కరిగించి వేస్తాయి, ఎందుకని? వాళ్ళకి మనసు లేదు కనుక. అంతేకాదు, కేవలం దృష్టి మాత్రం చేత మనకి కూడా మనసు లేకుండా చేస్తున్నారు. అందుకనే, పాదపూజలప్పుడు రక్ష పెట్టే సమయంలో గురుదేవుని దృష్టిలో దృష్టి నిలిపి చూడాలి. "చూపులోన చూపు నిలిపి స్వామి

రక్షయెసగునే. స్వామిను, నీవుయు, జగమును, సర్వము శివమయమగునే” (అని పాడారు శ్రీమాతాజీ).

నిజంగా అంతా తెలుసుకున్న వాడికి, అంతా ‘తెలివి’ లోనే వుంది. నేను యిక్కడినుండి యింతమందిని చూస్తున్నాను. ఇంతమందీ నా కంటిలోనే వున్నారు. నాకంటిలోనే వున్న మీ అందరినీ విడివిడిగా ఎలా చూస్తాను? విడివిడిగా మనస్సు చూస్తోంది. ‘నువ్వు’ అనే వాడివి ఉన్నావు - నీ కన్నే ఇంతమందిని పట్టించింది! నీకన్నే ఇంతమందిని పట్టిస్తే, సర్వజగత్తుని మనస్సు పట్టకుండా వుంటుందా? మాయకు లోబడిన మనసు పట్టలేదుగానీ, భగవన్మయమైన మనసు పట్టగలదు. ఎందుకంటే, భగవంతుడు అనంతుడు, అఖండుడు కాబట్టి, అట్టి భగవంతుడిని నిలుపుకున్న మనసు అనంతాన్ని తనలో దాచుకోగలదు. అటువంటి Chance (ఛాన్సుని) అనుభూతిని మనకి ప్రసాదిస్తున్నారు మహాత్ములు.

కానీ, మానవుడు అలా అనుకోటం లేదు. ఏదో కొంచెం తెలియగానే, లేకపోతే భగవద్గీతలో 4 శ్లోకాలు నోటికి రాగానే, తనకి అన్నీ వచ్చేసునని విర్రవీగుతాడు. గీతలోని సారాంశమైన “సర్వ ధర్మాన్ పరిత్యజ్య - మామేకం శరణం వ్రజ” అన్నది విడిచిపెట్టేసి, కేవలం భాషతోనో, పాండిత్యంతోనో ముడిపెడితే భగవంతుడు దొరుకుతాడా? ఎటువంటివాడు పండితుడని భగవంతుడు చెప్పాడు?

**“యస్య సర్వే సమారంభాః కామసంకల్ప వర్జితాః**
**జ్ఞానాగ్ని దగ్ధకర్మాణం తమాహుః పండితమ్ బుధాః”**

(భగవద్గీత 4/19)

అంటే ఎవరయితే జ్ఞానాగ్ని చేత సమస్త కామ సంకల్పాలని, కర్మలని దగ్ధం చేసుకుంటారో వారు నిజమైన పండితులని బుధులు (జ్ఞానులు) చెప్తున్నారు. కేవలం శాస్త్ర పాండిత్యం నిన్ను పండితుని చేయలేదు. కనుక, తెలియకపోవడం ఒకమాయ అయితే, తనకి అన్నీ తెలుసనుకోడం పెనుమాయ. ఈ తెలిసీ తెలియని అయోమయంలో పడి కొట్టుకుంటున్నారు మానవులు. తెలియనివారికి తెలియ చెప్పడానికే మహాత్ములు కంకణం కట్టుకున్నారు. కనుక, ఇన్ని తికమకలు లేవయ్యా “ఉన్నది నీవొకడేనయ్యా.... నీవుంటేనే నేనయ్యా నేనంటే నువ్వేనయ్యా” - భగవంతుడనే వాడు ఉన్నాడని గుర్తిస్తే,

భక్తి భావన పెంపొందించుకుంటే, అప్పుడు నీలో వున్న "నేను" ఎవరో గుర్తిస్తావు. అంటే నిన్ను నువ్వే గుర్తిస్తావు. 'ఉన్నది భగవంతుడు ఒక్కడే' - 'నీవుంటేనే నేను ఉన్నాను.' అనేది భక్తి భావన. "నువ్వంటే నేనేనయ్యా - లేక 'నేనంటే' నువ్వేనయ్యా" అనేది జ్ఞాన భావన.

కనుక, ఉన్నదంతా నీవే అయినప్పుడు, "నేను" అంటే "నువ్వే". కృష్ణుడు చెప్పేవాడు, అర్జునుడు వినేవాడు. తన రూపాన్ని సర్వవ్యాపకం చేసి భగవానుడు అర్జునుడికి తన విశ్వరూపం చూపించినపుడు, ఆ అర్జునుడు వేరేగా ఎక్కడున్నాడు? ఆ విశ్వరూపంలోనే ఉన్నాడు. అంతకుముందు వాళ్ళిద్దరూ వేరువేరుగా వున్నారు.

మరి, మనం ఆశ్రయించిన దేవుడు విశ్వవ్యాపకుడు కాదా? అలాకాకుండా, "ఓ దేవుడా! నువ్వలా గూట్లోనే వుండు నాయనా! గుళ్ళోనే వుండు! లేకపోతే అలా ఎక్కడో పైనే వుండు. నేను క్రిందనే వుంటాను" అని అంటే ఆయన పైనే వుండి, మనం క్రిందనే వుంటే మన జీవితం వెళ్తోందా? ఉన్నటువంటి వస్తువుని, ఉన్నది ఉన్నట్టుగా మనం గుర్తించలేకపోతున్నాం.

అందుకని, విశ్వవ్యాప్తమైన పరమాత్మని గుర్తించడానికి, ఎవరు ఏ గురుపాదాన్ని ఆశ్రయించారో ఆ పాదాన్ని స్థిరంగా నమ్మి, వారు చెప్పినట్టు విని ఆచరించాలి. అప్పుడు అర్జునుడికి విశ్వరూపం ఎలా చూపెట్టాడో, ఆ భగవానుడు గురురూపంలో మనకి ఉన్న విషయం ఉన్నట్టుగా దర్శింపచేస్తారు. గురుపరమాత్మ సర్వజ్ఞుడు, సర్వేశ్వరుడు, సర్వవ్యాపకుడు. కనుక, దానిని గుర్తించిననాడు ఈ సృష్టంతా ఆ పరమాత్ముని లీల అని తెలుసుకోగలుగుతాం; మన జీవితాలని ధన్యత చేసుకోగలుగుతాం. అట్టి సాధనాసంపత్తిని ప్రసాదించమని మహాత్ములని ప్రార్థిద్దాం. జై గురుదేవ్!.

హరిః ఓం తత్సత్

# సన్నిధిలో సంభాషణ

(గత సంచిక తరువాయి) - పరాశర ప్రసాద్

శాస్త్రాలు చదివినవారు భగవంతుణ్ణి తమ పాండిత్యంలో బంధించ గలుగుతారా? భగవానుడు భక్తికి మాత్రమే బంధితుడౌతాడు. ద్రౌపదికి మానభంగం కలుగనిచ్చాడా కృష్ణపరమాత్ముడు? నీ మనస్సు నిండా ఆయన్ని నింపుకుంటే నీ హృదయంలోనే ఉంటాడు. కాని నీ హృదయ భాండంలో వెలితి ఉంటే కృష్ణపరమాత్ముడు ద్వారకలోనో, వైకుంఠంలోనో ఉంటాడు. మరి ద్వారకలో ఉన్న కృష్ణపరమాత్ముడు వచ్చి రక్షించాలంటే టైమ్ పడుతుంది కదా! గరుడవాహనం మీద కాని, రథం మీద కాని రావాలి కదా! ఆయన నీ హృదయ మందిరంలో ఉంటే నీకు వెంటనే రక్షణ జరుగుతుంది. అటువంటి స్థితిలో ఉన్నవారికి దేహభావన ఉండదు. వారి శరీరాన్ని కోసినా వారికి తెలియదు. వారే సత్యగురుదేవులు. భావ సమాధి, సంప్రజ్ఞ సమాధి, అసంప్రజ్ఞ సమాధి స్థితులను గురించి శ్లోకాలలలో చదివినంత మాత్రాన ఆ స్థితిని పొందలేరు కదా! ఇది యదార్థమేనంటారా? బాబుగారు వీసెడు వంకాయలు కోసేస్తున్నారు, అని మీరు భావించవచ్చు.

మీకు ఒక ఉపమానం చెబుతాను. డాక్టర్లు ఆపరేషన్ చేసేముందు క్లోరోఫారం ఇస్తారు. ఆ వ్యక్తి మనస్సు ఇంద్రియాల నుండి విడిపోతుంది. శరీరం జడమైపోతుంది. శరీరాన్ని కోసినా తెలవదు. ఒక డాక్టరుగారు ఆపరేషన్ చేసి కడుపు లోపల గుడ్డపెట్టి కుట్టేశారు. ఆ విషయాన్ని తరువాత తెలుసుకున్నారు. మళ్ళీ ఆపరేషన్ చేస్తే చచ్చిపోతుందని చెప్పారు. ఆపరేషన్ చేసిన డాక్టరుగారు పేషంట్‌ను ఇంటికి తీసికెళ్ళమని సలహా ఇచ్చారు. రేపటి వరకు ఆగండి అని సలహా ఇచ్చాను. ఈ సన్యాసి ఏం చేయగలడు చెప్పండి? మా అమ్మను ధ్యానిస్తూ కూర్చున్నాను. ఆ మరునాడు వేరే ద్వారం ద్వారా అది బయటకు వచ్చేసింది. ఆ వ్యక్తి బ్రతికి సుఖంగా ఉంది. భగవంతుని లీలలు అలా ఉంటాయి.

**28-5-1985** - ఈ రోజు ఉదయం శ్రీబాబు దర్శనార్థం వచ్చిన భక్తులలో ఒకరు ప్రశ్నిస్తూ 'మహాత్ములు కూడా సాధారణ మానవుల వలె ఉంటారు కదా! వారిని మహాత్ములుగా గుర్తించడం ఎలాగు?' అని ప్రశ్నించారు. శ్రీబాబు సమాధానం చెబుతూ కరెంట్ పాస్ అయ్యే రాగి తీగ, కరెంట్ పాస్‌గాని రాగితీగె రెండూ ఒక రకంగానే ఉంటాయి కదా! కరెంట్ పాస్ అయ్యే రాగితీగెకి

బల్బు తగిలిస్తే కాంతి వస్తుంది. కరెంట్ లేని రాగితీగకి ఎన్ని బల్బులు తగిలించినా ఏం లాభం? అలాగే మహాత్ముల స్పర్శ, బోధ, వందనం ఎంతో విలువైనవి. సాధువు యొక్క దర్శనమే మహాభాగ్యము. పాము కరచి మృత్యువాతపడిన వ్యక్తిని ఉద్దేశించి 'ఏం నాయనా! నిదురపోతున్నావు? లే ఆ పాండురంగడి నామ రసాయనం ఇంకా నీలో ప్రవేశించలేదా?' అని బోధలబాబా తాకేసరికి ఆవ్యక్తి సజీవుడయ్యాడు. **సాధూనాం దర్శనం పుణ్యం, స్పర్శనం పాపనాశనం.** మహాత్ములతో సంభాషణ కోటితీర్థముల పుణ్యాన్ని అందజేస్తుంది. సాధువులకి వందనం చేయాలి. అవివేకులైన మానవులు కొందరు మహాత్ముల పాదములను స్పృశిస్తే మైలపడిపోతామేమో, ఆయన ఏ కులానికి చెందినవాడో, ఆయన ఇచ్చిన తీర్థం ఎలా తీసికోవటం, అని స్వజాతి, విజాతి దృష్టితో జాతిజాడ్యంతో, కులజాడ్యంతో ఆ తీర్థాన్ని స్వీకరించరు.

చైతన్య మహాప్రభువు తల్లి మడి కట్టుకుని నీరు తీసుకువస్తోంది. ఆవిడ శ్రోత్రియ బ్రాహ్మణ కుటుంబానికి చెందినది. ఎంతో ఆచారం. తన వెంట బాలకుడైన చైతన్యుడు కూడా వస్తున్నాడు. చైతన్యుడు ఆ దారిలో వచ్చే ఒక హరిజనుడిని తాకాడు. అది చూసిన తల్లి 'నాయనా! చైతన్యా!' అని కేకవేసింది. 'అమ్మా! వస్తున్నా'నని వెంటనే వచ్చి తల్లిని కౌగలించుకున్నాడు. 'నాయనా చైతన్యా నువ్వు మైలపడ్డావు' అంటుంది. అప్పుడు చైతన్యుడు బాలకుడే అయినా తల్లికి జ్ఞానబోధ చేస్తాడు. 'అమ్మా! ఆత్మమడి కట్టుకో'అని, 'అప్పుడు నీ మనస్సుకి పట్టిన చండాలత్వము వదిలిపోతుంది. బాతు నీట ఎంతసేపు ఉన్నా దానికి నీరు అంటదు. అలాగే శుద్ధ మనస్సుకి సమదృష్టి కలుగుతుంది' అని చైతన్యుడు బోధించేసరికి ఆ మాతృమూర్తి మనస్సులోని మాలిన్యము తొలగిపోయి భావసమాధిస్థితిని పొందింది. చూశారా! అటువంటి జ్ఞానపుత్రుడు కలిగిన వంశం ఉద్ధరింపబడుతుంది అన్నారు శ్రీబాబు.

ఇంకా మాట్లాడుతూ మీకొక ఉదంతం చెబుతాను. శ్రీకృష్ణుడు బాల్యంలో అనేకమంది రాక్షసులను సంహరించటమే కాక, వారితోపాటు ప్రచండ మహాపండితులలో కరుడుకట్టుకుపోయిన శాస్త్రవాసనని సీమటపాకాయలాగ పేల్చివేశాడు. గోపాలకృష్ణుడు నల్లని నగుమోము కలవాడు. మాడిపోయిన పిడక చెక్కకాదు. కొరకంచు ముఖం కాదు. ఆయన నగుమోము, మందహాసము సకల జీవకోటికి అందాన్నిస్తుంది. ఆయనకి సూర్యగుమ్మడికాయంత బొజ్జ ఉంది. ఆయన సాధువులకు సాధువు. అస్ఖలిత బ్రహ్మచారి. కృష్ణపరమాత్ముని లీలలు ఆ నోట ఆ నోట దేశమంతా తెలిసి ఒక ప్రచండమహాపండితుని చెవిన పడింది. ఆయన గోపాల కృష్ణుని ఎలాగైనా

దర్శించాలి అనుకున్నాడు. ఎలాగో నందుని భవనానికి చేరుకున్నాడు. తాను గొప్ప పండితుడు, సకల శాస్త్రాలను కాచి వడపోసినవాడు, మూడు సంవత్సరాల ప్రాయం గల బాలుని చూడటానికి నచ్చానంటే బాగుండదని ఏదో చెప్పాడు. ఇంతలో బంగారు కుర్చీలో కూర్చున్న బాల కృష్ణుణ్ణి దర్శించాడు. ఈ బాలకుడా! ఇన్ని మహత్తులు ప్రదర్శించినవాడు, అయినా గొల్లవాడు కదా! ఎలా చేయగలిగాడు! అనుకున్నాడు.

ఆ పండితుని దృష్టికి, విద్యకి అందని మహత్తు అది. ఇంతలో పండితుడు ప్రకటించాడు తాను ఎవరి ఇంట్లోనూ భోజనం చేయనని, కావలసినవి సమకూరిస్తే స్వయంగా వంట చేసుకుంటాను అని చెప్పాడు. పండితుని కోసం ఒక విశాలమైన గదిని ఏర్పాటు చేసారు. వంట పాత్రలు అన్నీ ఇచ్చారు. ఆ గదికి దగ్గరలోనే బావి ఉంది. పండితుడు చక్కగా వంట చేసుకున్నాడు. ముద్దపప్పు, పాయసం, గారెలు, కూరలు అన్ని వండుకున్నాడు. స్నానం చేశాడు. అరటిఆకు వేసుకున్నాడు. అందులో తాను వండుకున్న పదార్థాలన్నీ వడ్డన చేసుకుని తలుపులు దగ్గరగా వేసుకున్నాడు. ఇంక తినటమే తరువాయి. గ్లాసులోని నీరు తీసుకుని ఓం కేశవాయ స్వాహా! అని అనగానే తన ఎదురుగా కృష్ణుడు ఉన్నాడు.

వేసిన తలుపు వేసినట్లే ఉన్నది ఎలా వచ్చాడా అని ఆశ్చర్యపోయాడు. అమ్మా! యశోదమ్మా! నీ కొడుకు వచ్చాడమ్మా నేను ఎలా నివేదన చేసికొనేది? అన్నాడు పండితుడు. యశోదమ్మ సమాధానం చెప్పింది 'లేదండీ! ఇక్కడే ఉయ్యాల తొట్టిలోనే ఉన్నాడు. తీరా చూస్తే ఇక్కడా ఉన్నాడు, అక్కడా ఉన్నాడు. ఈ విధంగా రెండు పర్యాయములు జరిగింది. మూడో పర్యాయము తన గదికి మూడు తాళాలు వేసుకుని గోపాల కృష్ణుడిని ఉయ్యాలలో పరుండబెట్టి ఉయ్యాల ప్రక్కనే యశోద కూర్చుని తీసుకోవలసిన జాగ్రత్తలన్నీ తీసుకున్న తరువాత మళ్ళీ నివేదన చేసుకోవటానికి ఉపక్రమించి ఓం నారాయణాయ స్వాహా! అని అవపోసనం పట్టగానే ఎదురుగా గోపాల కృష్ణుడు చిరునగవు చిందిస్తూ నా నామం ఉచ్ఛరించావు కాబట్టి నేను వచ్చాను అనేసరికి పండితుడు ఒక్కసారి ఆలోచించి కళ్ళు మూసుకొని మనసారా **ఓం నమో భగవతే వాసుదేవాయ** అని స్మరించేసరికి వాసనలన్నీ హరించి స్వజాతి, విజాతి, స్వగత భేదం నశించేసరికి శ్రీకృష్ణ పరమాత్మని విశ్వరూప దర్శనాన్ని పొందగలిగాడు. పండితునికి తన జన్మ సంస్కారం చేత కనువిప్పు కలిగింది అన్నారు శ్రీబాబు.

-సశేషం

## శ్రీకాళీగార్డెన్స్‌లో విశేషపూజా కార్యక్రమములు

జూన్ 2011

10 శుక్ర శ్రీసుగుణప్రసాదమాతాజీవారి చతుర్థ వార్షిక పుణ్యతిథి సందర్భంగా సాయంత్రం సత్సంగసమావేశము.

15 బుధ పూర్ణిమ, శ్రీ సద్గురు పాదపూజ.

25 శని శ్రీ గురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

29 బుధ మాస శివరాత్రి.

**జూలై 2011**

11 సోమ తొలిఏకాదశి, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

15 శుక్ర ఆషాఢ (వ్యాస పూర్ణిమ) శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన. (చాతుర్మాస్య దీక్ష ప్రారంభం)

17 ఆది దక్షిణాయన ప్రారంభము

25 సోమ శ్రీగురుదశమి, సత్సంగం,శ్రీ సద్గురు పాదపూజ.

29 శుక్ర మాసశివరాత్రి.

*అయస్కాంత సాన్నిధ్యమాత్రంతో సూదులు కదులుతాయి. కాని కర్తృత్వం అయస్కాంతానికి లేదు.*

*సూర్యుడు పొడిస్తే చాలు పద్మాలు వికసిస్తాయి; కలువలు ముకుళిస్తాయి; కొందరు కృషి, వాణిజ్యాలకు, కొందరు ఉద్యోగాలకూ కొందరు ఆహ్నికాదులకూ పోతారు.*

*సూర్యుడు ఎవరితోటీ ఏ పనీ చేయించడు. ఆయన కర్తకాదు. కేవలం అధ్యక్షుడు మాత్రమే.*

*భగవంతుడు* ***'మయాధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరమ్'*** *అనటంలో అర్థమిదే.*

# శ్రీ లల్లాదేవి

- సుశీలా ప్రసాద

శాంతి పూజలు చేసిన ఆ యింటివారు అందరికీ భోజనాలు పెట్టారు. విందారగించిన వారిలో కొందరు తమదారిన తాము పోక "ఈ యింటి కోడలేదీ?" అంటూ నలువైపులా కలయ చూశారు. పెరటి వసారాలో తలవంచుకుని కూర్చున్న ఆమెను చూసి "అమ్మాయీ! మేమంతా తృప్తిగా తిన్నాము. మరి నీకేమేమి పిండివంటలు వడ్డించారు మీ అత్తవారు?" అని ఊసుపోని ప్రశ్నలడిగారు. వంచిన తల ఎత్తకనే తన ముందున్న పళ్ళెంవైపు చూపిందామె. అందులో.... తెల్లని రాతికి చుట్టూ అంటించిన అన్నం మెతుకులున్నాయి. "ఎన్ని పండుగలు వచ్చినా నా వంతు విందు మాత్రం యిదే" అంటున్న ఆమె పెదవులపై చెరగని చిరునవ్వు వెలసి ఉంది. ఆ మెతుకులను ఏరుకుని తిని, మళ్ళీ భోజనం చేయడానికి ఆ రాతిని కడిగి వంటింట్లో యధాస్థానంలో ఉంచుతూ "సర్వేశ్వరా! ఇది నీలీల!" అనుకుంటూ ఉంటుందామె.

ఆమె పేరు లల్లాదేవి. కాశ్మీర దేశంలోని ఒక బ్రాహ్మణ కుటుంబంలో భాద్రపద పౌర్ణమినాడు పుట్టి, మంచి సంస్కారవంతురాలైన లల్ల విశుద్ధమైన మనస్సులో శివభక్తిని అలవరచుకుంది. "తల్లీ! నువ్వు చిన్నతనంలోనే నా వద్ద సాధన రహస్యాలను గ్రహించావు. ఇప్పుడు నీకు వివాహమై అత్తవారింటికి వెడుతున్నావు. ఊరేగాక పేరుకూడా వివాహానంతరం అత్తవారింటి ఆచారంగా పద్మావతిగా మారిన నీవు నూతన జీవితంలో అడుగు పెట్టబోతున్నావు. ఎక్కడున్నా నీ మనస్సు మాత్రం చలించని విధంగా మసలుకో!" అంటూ ఆమె గురుదేవులైన సిద్ధ శ్రీకంఠుల ఆశీస్సులందుకుని ముందుకు నడుస్తూ "కత్తి విడిస్తే (హింస మానితే) రాజ్యసుఖం, చిత్తమణిగితే దివ్య సుఖం, గురూత్తముని పలుకును విశ్వసించి నడిస్తే కర్మలంటవు" అనుకుంది లల్లాదేవి.

"అసలు ఆవిడకు భర్తంటే యిష్టమూ, ప్రేమా లేవు. మరి పెళ్ళెందుకు చేసుకున్నట్లో!" అని ఒకరంటే, "అది నీళ్ళు తేవటానికి వెళ్తుందా, జాము గడిచినా అక్కణ్ణించి కదిలి రానేరాదు. అందులో ఏదో ఉంది" అని వేరొకరు లల్లమీద అపవాదులు వేస్తుంటే వింటూ అవి పట్టించుకున్నవారు, ఆ

రహస్యమేమిటో గ్రహించాలని తహతహలాడుతూ ఆమెను అనుసరించి వెళ్ళారు. నటకేశవ భైరవాలయం దగ్గరున్న నదిని దాటి వెళ్ళిందామె. ఆమెను అనుసరించి వెళ్ళారు.

అక్కడ...... ప్రశాంతమైన వాతావరణంలో ఆమె మౌనంగా శివ ధ్యానంలో కూర్చుని ఉంది. ఆమె మోములో ఆనందం తాండవిస్తోంది. వెంటపడినవారు నిజం గ్రహించి సిగ్గుపడ్డారు. మనస్సు మారింది వారికి. ఆమెను క్షమించమని కోరారు. "తమ తమ స్వభావాలను బట్టి దూషించినా, పొగడినా అవేమీ లెక్కించను. నిర్మలమైన బోధామృతాన్ని ఆస్వాదిస్తూ మైమరచిపోతాను'' అంది వారితో. "రాక రాక మనుష్య జన్మ వచ్చింది. భాగ్యాల కోసం ప్రాకులాడను. శివుడే మనస్సంతా నిండినప్పుడు చీకుచింతలు చేరవెప్పుడు'' అని దృఢంగా చెప్పింది.

ఎవరేమి చెప్పినా అత్తగారికి కోడలిపై అనుమానమే. ఆమె పట్ల ఆగ్రహమే వ్యక్తం చేస్తూ ఉండేది. ఎంతచాకిరీ చేసినా తృప్తి లేదు. ఆవేళ... పట్టరానంత కోపంతో ఊగిపోతునన్నది అత్తగారు. ఎదురుగా తలపై నీళ్ళకుండను మోసుకుని వస్తున్నది. చిత్తం శివునిపైన నిలిపిన మహాయోగిని కోడలు. ఆ మహాతల్లిని హింసించడానికి రాకాసివలె కర్రతో కొట్టింది అత్తగారు. అది తగిలి కుండ పగిలింది. కుండ పెంకులు నాలుగువైపులా చెదిరిపడ్డాయి. కానీ ఆశ్చర్యం! కుండ ఆకారంలో నీళ్ళు మాత్రం లల్లతలపై ఆలాగే నిలిచిపోయింది. ఏమీ జరుగనట్లే, ఒక్కమాటఅయినా పలుకక, ఆ నీటిని తీసుకెళ్ళి ఇంట్లోని పాత్రలన్నిటిలో నింపింది. ఇంకా మిగిలే ఉన్నాయి. ఆనీటిని బైట పారపోసింది. అక్కడొక చిన్న చెరువు ఏర్పడింది. దానికి 'లల్ల చెరువు' అని పేరు వచ్చింది. షేక్ గులాం హసన్ అనే పర్షియా దేశ యాత్రికుడు ఎల్లప్పుడూ ఆ చెరువు నిండుగానే ఉండేదని **1925-26** వరకూ ఎప్పుడూ అన్ని వేళలలోనూ జలపూర్ణమై ఉండేదని వర్ణించాడు. ఈ అద్భుతం జరిగాక ఆమె ఖ్యాతి వ్యాప్తి చెందింది. ఆ వెనుక ఆమె ఇంటిని వదిలింది.

"నా గురువు నాకొక మాట చెప్పారు. 'బాహ్యదృష్టిని వదిలిపెట్టు, అంతరాత్మను చూడు' అని. ఈమాట సూటిగా నా హృదయంలో ప్రవేశించి అక్కడ స్థిరపడింది. అందుకే బాహ్యశరీరం నగ్నమైనా నాకు తెలియటం లేదు''. ఇలాగ ఆమె దేహస్మృతిని వదిలి అవధూత స్థితిని పొందింది.

"తల్లీ! నువ్వు తలమీద ఒక నీటి కుండను పెట్టుకుని, పాదాల మీద మరొక కుండ పెట్టి నిలిచి, ఒక పదిహేను రోజులులు అమావాస్య వరకు నిలబడి ధ్యానం చేసావు. నీ శరీరమంతా క్షీణించిపోయింది. కానీ నీ క్రింద కుండలో కాస్తంత తెల్లని మెరుపు కదలాడుతూ కనిపించింది. నువ్వలా ధ్యానం చేస్తూనే ఉన్నావు. తిరిగి పూర్ణిమనాటికి చంద్రుడు పూర్ణరూపుడయ్యేసరికి మళ్ళీ నీ శరీరం యధాప్రకారం సౌష్టవం చెందింది. అయితే నీ శరీరం పూర్తిగా క్షీణించిన తరువాత క్రింద కుండలో మెరుపు మిగిలిందేమిటి?'' అని ప్రశ్నించారు గురుమూర్తి లల్లను.

''అది నేనే'' అన్నదామె. ''దేహేంద్రియాలు, మనోబుద్ధి చిత్తాహంకారములు అన్నీ వదిలివేసిన తరువాత కూడా మిగిలిన నాలో ఈశ్వరుడు నన్ను స్వీకరిస్తాడా లేదా అనే ఆందోళన ఆ మెరుపులోని కదలిక. ఎంత తపస్సు చేసినా చివరికి ముక్తి అనేది ఆ పరమేశ్వరుని అనుగ్రహంపైనే ఆధారపడి ఉంటుంది'' అని ఆమె గురుమూర్తికి సమాధానం చెప్తూ, తపస్సు అనేది ఎలాగ ఉండాలో ఆయనకు చేసి చూపించింది. "విగ్రహపూజలు, కర్మలు చేయటంతో తృప్తి పడవద్దు. సర్వవ్యాపకుడైన సర్వేశ్వరుని అంతరంగంలో ధ్యానించి, అంతటా వానిని దర్శించండి'' అని బోధించింది.

శ్రీఆదిశంకరుల సర్వజ్ఞ పీఠానికి స్థానమై, ఎందరో మహాకవులకు తల్లి అయిన భూలోక స్వర్గమనదగిన శ్రీకాశ్మీర దేశంలో పుట్టిన ఒక అనర్ఘరత్నమే లల్ల యోగీశ్వరి. సంపూర్ణ రాజయోగసిద్ధిని పొందిన యీామె, **14**వ శతాబ్దంలో ఉన్న లల్లాదేవి శిష్యులలో, భక్తులలో కేవలం హిందువులు మాత్రమే కాక, ముస్లిములు, క్రైస్తవులు కూడా నేటికీ ఉన్నారు. అనేక తాత్త్విక ధార్మిక బోధలను యోగరహస్యాలసను కూడా ఆమె తన బోధలలో వెదజల్లుతూ భక్తులందరికీ అందించింది.

లల్ల ఆశువుగా చెప్పిన కాశ్మీర భాషలోని శ్లోకాలు నాలుగు ప్రవచనాలలో ఉదాహరణలుగానే కాక కొన్ని చోట్ల శివారాధనలో అభిషేకమందు "లల్లవాక్కుల''ని ప్రసిద్ధి . ఒక కాలంలో బోధ జ్ఞానము, వివేకము, నీతి బోధ ఇవన్నీ ఎంతో అవసరమైన హిందూ సమాజానికి లల్ల ఒక యోగినిగా, జ్ఞానిగా, నీతి ధర్మాలను ప్రబోధించి సమాజాన్ని ఉద్బోధించి ధర్మాన్ని ఆదుకుంది.

ఆ సమయం ఫాల్గుణ శుక్ల అష్టమి. స్థలం శ్రీనగరానికి ఆగ్నేయ దిశలో **28**మైళ్ళ దూరంలో జమా మసీదు గోడ వెనుక ... అక్కడొక అద్భుతం

జరిగింది...

లల్లాదేవి ఒక పెద్ద పాత్రలో కూర్చుంది. తనపై మరొక పాత్రను మూత పెట్టుకుంది. “ఎంతో వింతగా ఉందే” అని చూసి చూసి కడకు కొందరు పై పాత్రను తొలగించి చూసారు. ఆమె కనబడలేదు! ఆమె శరీరం అదృశ్యమై ఒక అపూర్వమైన తేజస్సు కనబడి అది కూడా అంతర్ధానమైంది. ముహమ్మదుద్దీన్ ఫాక్ అనే రచయిత ఆమె శరీరంలో నుంచి ఒక దివ్య తేజస్సు బహిర్గతమై అంతర్ధానమైందని అనేక మంది అది చూశారని వర్ణించాడు.

ఆమె నిరంతర సమాధి స్థితిలోనే ఉంటూ శివశక్తుల ఏకరూపమై తన హృదయమందే ఉండి తనకు కనబడుతున్నారని తన యోగాలనుభవాలను అక్కడక్కడ తన మాటలలో తెలియజేస్తూ వచ్చింది. ఆమె ఒక చూపు, ఒక వాక్యం చాలా మందికి యోగస్థితిని ప్రసాదించింది.

కాశ్మీరంలో విరబూసి పలుతావుల పరిమళాలు వెదజల్లిన శివపూజా కుసమం లల్లాదేవి.

స్వాతి నక్షత్రం మింట ఉన్నప్పుడు పడే వానచినుకులు గ్రహించటానికై ముత్తెపుచేప సముద్రం అడుగు నుంచి సముద్రం ఉపరితలానికి వస్తుంది. అది తన చిప్పలను తెరుచుకొని ప్రశస్తమైన స్వాతి వాన చినుకు పట్టుపడేవరకు నీళ్ళమీద తేలుతూ ఉంటుంది. చినుకు పట్టుపడగానే సముద్రపు అడుగుకు - తన నివాసానికి వెళ్ళి ఆ చినుకును చక్కని మంచి ముత్యంగా మార్చేవరకు స్థిమితంగా అక్కడే ఉంటుంది.

అలాగే తారకమంత్రోపదేశం చేసే సద్గురువు లభించటానికి ఒకచోటు నుంచి మరొక చోటుకు సంచారం చేసే ముముక్షువులు కొందరుంటారు. అలాటి సద్గురువును చూసే భాగ్యం కలిగి, అతడివల్ల తారకమంత్రోపదేశాన్ని పొందగానే వారు (ముముక్షువులు) సమస్త అంగాలను వీడి, హృదయాంతరాళలో ప్రవేశించి, బ్రహ్మానంద ప్రాప్తి పర్యంతం (మంత్రజపం చేస్తూ) అందులోనే నెలకొని ఉంటారు.

- శ్రీరామకృష్ణ పరమహంస

# శ్రీకృష్ణ కర్ణామృతం

-సుశీలా ప్రసాద

17వ శ్లో॥ **మమ చేతసి స్ఫురతు వల్లవీ విభో**
**రమణి నూపుర ప్రణయి మంజు సింజితమ్,**
**కమలావనే చర కన్దళీ కన్యకా**
**కల హంస కణ్ఠ కల కూజీతా ధృతమ్ ॥**

చిరకాలంగా మానస సరోవర తీరాన తపో నిమగ్నుడై ఉన్న ఆ మునీశ్వరులు నేడు సమాధి చాలించి, కనులు తెరవబోతుండగా, వీనుల విందుగా వారికి మహతీ నాదం వినవచ్చింది. ససంభ్రమంగా లేచి నిలచిన వారి యెదుట కనువిందుగా నారదమునీంద్రులు గోచరించారు.

సవినయంగా వారికి నమస్కరించి, ఉచితాసనమిచ్చి, అర్ఘ్య పాద్యాదులిచ్చిన తపస్వులు "స్వామీ! త్రిలోక సంచారులైన తమ దర్శనంతో మమ్ములను పావనం చేసారు. ముల్లోకాలలోను జరిగే సంగతులన్నీ తమకు ఎరుకే గనుక మాయందు అనుగ్రహంతో విశేషాలేమైనా తెలిపితే వినేందుకు కుతూహల పడుతున్నాము.

ముందుగా మాదొక మాట. మేము నేడో, రేపో కైలాసానికి పోయి పశుపతిని దర్శించి, ఆపైన వైకుంఠానికేగి శ్రీమన్నారాయణుని సేవించుకోవాలని ఆశపడుతున్నాము" అన్నారు.

నారదులవారు చిరునవ్వుతో "నేను చెప్పబోతున్న ముఖ్యమైన విషయం గ్రహించండి. శ్రీమహావిష్ణువు ఇప్పుడు వైకుంఠంలో లేరు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేసి ధర్మ సంస్థాపనార్థమై భూలోకంలో అవతరించి ఉన్నారు. లోక కళ్యాణం కోసం అలాగ వెళ్ళిన శ్రీహరితో ఆదిశేషుడు, దేవగణము, అచ్చరలు కూడా తరలి వెళ్ళారు.

ఇలలో స్వామి మధురా నగరాన, చెరసాలలో దేవకీ వసుదేవ తనయుడై ఉద్భవించి, ఆ వెంటనే వ్రేపల్లెకు చేరి, నంద యశోదార నందనుడై వర్థిల్లుతున్నాడు. ఇదంతా స్వామి దివ్య సంకల్పమే.

ఆ లీలా కిశోరుని మహాదేవులు వెళ్ళి దర్శించి వచ్చారని విన్నాను. ఆ ముచ్చటలను కైలసవాసుని అడిగి తెలుసుకోండి. మరి నేను వెళ్ళివస్తా"నంటూ నారదముని ఆ తావు నుండి మరలిపోయారు.

వ్రజవాసిని రజతగిరివాసి దర్శించి వచ్చారని నారదులువారు చెప్పిన శుభవార్త విని ముని మనస్సులలో తామూ అట్టి భాగ్యమందాలనే కోరిక చిగురించగా జటాధారులైనవారు తమ దండకమండలాలలతో వెండి కొండకు కదలిపోయారు.

సరసన అర్థాంగితో, చిరుదరహాసవదనుడై, ఉన్న పరమేశ్వరుని ఎదుట శిరస్సున అంజలి ఘటించి నిలచిన మునీశ్వరులను అనుగ్రహిస్తూ గౌరీపతి వారివంక సాదరంగా చూశాడు. ఆ చూపే తమకు ఆనతిగా భావించిన మహర్షులు "దేవదేవా! తాము వ్రేపల్లెలో వెలసిన వైకుంఠ నాథుని లీలా వినోదమూర్తిని కనులారా తిలకించి వచ్చిన సంగతి నారదుల వారి ద్వారా విన్నాము. ఆ మధుర కథనాన్ని తమ దివ్యవాక్కులతో వర్ణిస్తే వినడానకి వేడుక పడుతున్నాము. మా యందు దయతో ........" శివుడు వారిమాట పూర్తికాకుండానే "అవశ్యం చెబుతాను. ఆది నారాయణుని చరితను మననం చేసుకోవటంలో ఎంతో ఆనందముందిగదా!" అంటూ జరిగిన వృత్తాంతాన్ని వివరించసాగారు.

"శ్రీ మహావిష్ణువు మానవలోకంలో ఆవిర్భవించిన పిమ్మట, నా మనోనేత్రంతో వానిని దర్శించాను. నా దివ్యదృష్టికి గోచరించిన ఆ దివ్య బాలక రూపం మునుపు జగన్మోహినీ అవతారం కన్న ఎక్కువగా నన్ను మోహపరచినందున వానిని చూడాలనే కోరిక నాలో ప్రబలమై, నన్ను వ్రజభూమికి నడిపించింది.

పతిదేవుని మాటలు వింటూ పార్వతి సన్నగా నవ్వింది. "కోరికలు వేనినీ దరిచేరనీయని మా విభూతి, విష్ణుమాయ ముందు మునుపు కూడా తలవంచటం, అది మా అన్నగారి గొప్పదనం కదా!" అన్నది. మహేశ్వరుడు మందహాసం చేస్తూ "మేము అభేదమూర్తులమైనా, నీ ఆజ్ఞావశులమై కదా జగత్పాలన చేస్తున్నది దేవీ!" అన్నాడు. జగన్మాత వెన్నెల వలె చల్లని నవ్వుతో "ఇన్ని రూపాలతో వెలసి ఉన్నది మీ ఆత్మ శక్తినే కదా నేను" అంటూ "మరి కథనం కానివ్వండి. వినవేడుకవుతోంది" అన్నది.

- సశేషం.

# పరిప్రశ్నేన సేవయా

-పరాశర ప్రసాద్

శ్రీగురుదేవులు సత్సంగ సమావేశాలలో భక్తులకు కలిగిన సందేహాలను నివృత్తి చేసేవారు.భక్తులు అడిగినా, అడగకపోయినా వారి మనస్సుల్లో ఈ విషయాన్ని తెలుసుకోవాలి అనే తీవ్రమైన వాంఛ ఉన్నట్లయితే ఆ విషయాన్ని ప్రస్తావించి సందేహ నివృత్తి చేసేవారు.

సూచనా మంత్రం గురించి ప్రశ్న ఉదయించింది. ఎవరో సూచనా మంత్రం అంటే ఏమటి? అని ఇందిరని అడిగారేమో! కాని ఆవిడ 'మా అక్కయ్యని అడిగి చెబుతాను' అని అందనుకుంటాను. తరువాత బళ్ళారి శాస్త్రిగారిని అడిగారు. ఆయన కూడా చెప్పలేదు. "వారినీ వీరినీ అడగట మెందుకు బాబుగారినే అడగండి" అని సలహా యిచ్చారు.

అంతవరకు యదార్థమే. ఏ సందేహము కలిగినా సద్గురుమూర్తినే అడిగి తెలుసుకోవాలి. సమయము వచ్చినప్పుడు ఆయనే తెలియజేస్తారు.

"సూచనామంత్రం అనేది అనుష్ఠానం చేసే మంత్రం  కాదు. అది రహస్యమైనదే. దాని గురించి అందరూ చెప్పరు.

గోప్యంగా ఉంచి సాధకులందరికి అందుబాటులో లేకుండా చేశారు. దేవ రహస్యాలు ఉంటాయి. అవి అన్ని అందరికి తెలియకపోవటం ఒక రకంగా మంచిది. నువ్వు మరణిస్తావనో, వ్యాధి వస్తుందనో, ఏదో విపత్తు సంభవించబోతోందనో తెలియక పోవటమే మంచిది. తెలిసినా తెలియకపోయినా సంభవించేది ఆగదుకదా! ముందే దాన్ని గురించి ఊహించుకుని బాధ పడటం అనవసరం.

మానవులకు తమ వ్యక్తిగత రహస్యాలు ఎన్నో ఉంటాయి. అవి ఇతరులకి ఎంత సన్నిహితులైనా తెలియజేస్తారా! మరి దేవరహస్యాలు  ఎవరో తెలియజేయ లేదని అనుకోవటం ఎందుకు?" అన్నారు.

శ్రీగురుదేవులు బోధని కొనసాగిస్తూ 'సోzహం' అనేది సూచనా మంత్రం. మానవుడు పుట్టినది మొదలు అంతిమ శ్వాశ వదిలే వరకు మార్పులేనిది 'సోzహం' భావన. గురుమూర్తి ప్రసాదించిన లక్ష్యార్థ సాధన ద్వారా 'సోzహం' అనేది మూలాధారం నుండి సహస్రారం వరకు సంచరించే

హంస లేక తేజస్సుగా గుర్తించగలుగుతాడు.

ఆ తేజస్సే గురు కాంతి. అదే సర్వవ్యాప్తమై జగత్తుకు ఆధారమైనది. నీ జ్ఞానేంద్రియాలతో అన్ని విషయాలు తెలుసుకునే తెలివి లేక ఎరుక అనుక్షణం నీ వెంట ఉండి నిన్ను సత్యమార్గము అనుసరించమనే వివేకము నీలో ఉందా! నీకు వెలుపల ఉందా! అదే "నేను" అని గుర్తించటమే 'సోzహం అనే భావన.

అది అహంకారపూరితమైన 'నేను' కాదు. రూపనామక్రియారహితమైన 'నేను' సాధకుడు. తన దేహాన్ని ఇంద్రియాలని, మనస్సుని, గుణాలని అధిగమించినప్పుడు 'సోzహం' అనేది గుర్తించగల్గుతాడు.

మానవుడు స్వప్నావస్థలో పొందిన అనుభూతి స్వప్నంలో ఉన్నంతవరకు యదార్థమే. కాని మెలకువ రాగానే అది అసత్యమని తెలుసుకుంటాడు. అలాగే దేహభావనలో ఉన్నంతవరకు జగత్తుని దాటి వెళ్ళలేడు. దానిని అధిగమించినప్పుడు 'సోzహం' అనుభూతిని పొంద గలుగుతాడు.

సద్గురుమూర్తిని ఆశ్రయించిన సాధకుడు లక్ష్యార్థ సాధనలో వివేకవంతుడై 'నేనెవరు?' అనే ప్రశ్నకు సమాధానంగా సద్గురుమూర్తి అనుగ్రహంతో 'ఆ ప్రజ్ఞాన బ్రహ్మవునీవే' అని తెలియజేసేదే సూచనామంత్రం. 'సోzహం' అన్నారు శ్రీబాబూజీ మహరాజ్.

దానిని సాధించటానికి ముసుగులూ అక్కర్లేదు, గురుదక్షిణలు, ధనధాన్యాలు, వస్త్రాలు అంతకన్నా ఇవ్వనవసరం లేదు. అది నీ ఆవేదన, శ్రద్ధ మీద ఆధారపడి ఉంటుంది. చెరువులో నీరు ఎంత ఉంటే తామరపూవులు అంత పుష్కలంగా విస్తరించి ఉంటాయి. దీనిని అర్థం చేసుకోండి చాలు"అన్నారు శ్రీబాబూజీ మహరాజ్.

నీలో ఏ కొంచెం మంచి ఉన్నా గుప్తంగా పదిలపరచి కాపాడుకో. కాలక్రమంలో అది నిన్ను కాపాడుతుంది. భూమిలో మట్టి క్రింద గుప్తంగా ఉన్న విత్తనమే అనంత ఫలాన్నివ్వ గల్గుతుంది. బట్టబయలున్న విత్తనం ఎందుకూ కొరగాదు.

# శ్రీ బాబూజీ దివ్యవాణి

భగవానుని ఆశీస్సులవల్ల, ఆయన కృపవల్ల మాత్రమే సకల జగత్తూ, అందలి సమస్త చరాచరములు మనగలుగుతున్నాయి.ఆ ప్రభువు సర్వశక్తి సంపన్నుడు. ఆయన శక్తి అనంతం. సృష్టి, స్థితి, లయ కారణమంతా నిరంతరం ఈ అనంత శక్తి వల్లనే జరుగుతోంది.

విద్యుచ్ఛక్తి, ఇంధనం కొరత మొదలైన వాటితో ప్రజలు బాధపడటం ఈనాడు మనం చూస్తున్నామంటే, అనంత శక్తి నిలయుడైన భగవానుని మరచి పోవడం వల్లనే. చేయవలసిందల్లా, ఆ శక్తిదాతతో విడదీయరాని సంబంధం ఏర్పరచుకోవటమే; కోరినంత శక్తి ఎడతెగకుండా లభిస్తూనే ఉంటుంది. ఇక ఎన్నడూ ఏ కొరతా మనలను బాధించదు.

అందువల్ల మానవుడు ఒక చేత్తో తన నిత్యకృత్యాలను చేస్తూనే, రెండవ చేతిని భగవానుని పాదాల యందుంచాలి. శాశ్వతశక్తికి మూలమైన వస్తువుతో ఆ విధంగా విడదీయరాని సంబంధం ఏర్పడుతుంది. తన విధి నిర్వహణ పూర్తి కాగానే ఆ చేతిని కూడా భగవానుని పాదాల వద్దకే చేరిస్తే ఇహ కావలసిందేముంది? మళ్ళీ ఛార్జి చేయబడిన తరువాత బ్యాటరీ పూర్తిగా విద్యుదావేశితమైనట్లు మానవుడు కూడా తన లక్ష్యాలన్నీ సాధించుకోటానికి కావలసినంత శక్తి పొందుతాడు. ఆ విధంగా మాత్రమే మానవుడు శాశ్వత సుఖ శాంతులను అనుభవించగలడు.

ప్రొద్దునే లేచి ఇంటి నుండి బయల్దేరిన మానవుడు పగలంతా ఎన్ని చోట్ల తిరిగినా, ఎంత పని చేసినా, తిరిగి సాయంకాలమయ్యేసరికి ఇంటికే చేరుకోవాలని కోరుకుంటాడు. కాని ఇంకెక్కడికీ పోవాలనుకోడు. ఎందువల్ల? ఇంటి వద్ద తనకు లభించే స్వేచ్ఛ, సుఖం అతనికి మరెక్కడా లభించవు. మనందరి శాశ్వత నివాసం భగవానుని పాదాల వద్దనే. అక్కడకు చేరినప్పుడే మనకు స్వేచ్ఛ, సుఖ, శాంతులు లభ్యమవుతాయి.

మరి అట్టి ప్రభువునే మరచిపోతే? అసలే చంచలమైన మానవుని మనస్సు మరింత దోవతప్పి, భౌతిక విషయాలనే సుడిగుండాలలో చిక్కుకుని ఆ ప్రభువుకు దూరమైపోతుంది. అలా దోవ తప్పిన మనస్సులోనే స్వార్థం, దురాశ, ద్వేషం మొదలైన నీచ గుణాలు చోటు చేసుకుని వ్రేళ్ళు తన్ని బలపడతాయి. ఇక అతని మనస్సు కూడా క్రుళ్ళి దుర్గంధ భూయిష్టమవుతుంది.

అది పతనహేతువు.

పారిశ్రామిక రంగంలో ప్రముఖుడైన ఒక సంపన్నుని ఉదాహరణగా తీసుకుని శ్రీ హనుమత్కాళీ వరప్రసాదబాబు తమ ప్రసంగాన్ని కొనసాగించారు. ఆ సంపన్నుడు కోట్లకొలది ద్రవ్యం ఖర్చుచేసి ఒక పెద్ద పరిశ్రమ స్థాపించాడు. అందులో పనిచేస్తున్న అనేక వేలమందికి అది జీవనాధారంగా ఉన్నది. అక్కడ తయారయ్యే పదార్థం చాలా ఉపయోగకరమైనది కావటంవల్ల, ఈ దేశంలోనే కాకుండా ఇతర దేశాలలో కూడా దానికి మంచి గిరాకీ ఉంది. ఆ పరిశ్రమ ఇంకా వృద్ధి పొందాలంటే ఆ యజమాని ఆ ఉద్యోగులు, వారి కుటుంబం, ఆ రాష్ట్రం, దేశం కూడా శాశ్వత ఐశ్వర్యంతో, సుఖశాంతులతో ఉండాలంటేనూ, ఈ పవిత్ర కృషినే యోగసాధనగా మలచుకొని వారందరూ కర్మయోగులై తరించాలంటేనూ, వారందరూ ఆ పరిశ్రమ యెడల తమ మనః ప్రవృత్తిని ఎలా దిద్దుకోవాలి?

మామిడి టెంక ఒకటి నాటామనుకోండి. ప్రతియేడూ అనేక వందల పండ్లు, మంచి మంచివి కావాలని ఆశిస్తాము. ఏం చెయ్యాలి? ఆ మొలిచే మొలకకు చక్కని పాదుచేసి, రోజూ నీళ్ళుపోస్తూ, భూమికి తగినంత ఎరువు వేసి బలంచేస్తూ, కలుపు తీస్తూ, చీడపట్టకుండా తగిన జాగ్రత్త తీసుకుంటూ ఉండాలి. ఇంత మాత్రం మనం శ్రద్ధ మనం తీసుకుంటే. మాను కట్టమనీ, కొమ్మలు, రెమ్మలు పెరగనివ్వమని మనం చెప్పనక్కరలేదు. ఆ విషయమంతా భగవానుడే చూసుకుంటాడు. ఆ మొక్క త్వరలోనే పుష్టిగా ఎదిగి మహా వృక్షమవుతుంది. అక్కడి ప్రజలందరికి అది చల్లనిగాలిని, చక్కని నీడను ఇస్తుంది. ఆ ప్రదేశానికి అది అందాన్ని, ఆనందాన్ని చేకూరుస్తుంది. దానిని నాటిన ఆసామీయేగాక ఇంకా అనేకమంది తాము అనుభవిస్తూ ఇంకా దేశంలోని ఇతర ప్రాంతాలకు, విదేశాలకు కూడా ఎగుమతి చేయటానికి సరిపోయేటట్లుగా వందల కొలది మంచి మంచి కాయలను, పండ్లను ఎన్నో యేళ్ళపాటు అందిస్తుంది. తన కోసం ఏ ప్రతిఫలమునూ, కోరకుండానే ఆ వృక్షం మానవులకు ఇన్ని ఉపకారాలు చేస్తూ, స్వార్థ రహితమైన సేవ ఎలా చేయాలో మానవులమైన మనకు నేర్పుతున్నది కూడా. కాని మొక్కగా ఉన్నపుడు సరైన శ్రద్ధ తీసుకొనకపోయినా, చెట్టును జాగ్రత్తగా కాపలా కాయక పోయినా, ఆ ఆసామికి, ప్రజలకేగాక దేశానికే తీరని నష్టం తప్పదు కదా!

-సశేషం

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

## శ్రీ పరశురామయ్య గారితో శ్రీబాబు

1. బహూనాం జన్మనామంతే । జ్ఞానవాన్ మాం ప్రపద్యతే।
వాసుదేవ స్సర్వమితి । సమహాత్మా సుదుర్లభః ॥ (భగవద్గీత 7-19)
2. తేషాం జ్ఞానీ నిత్యయుక్తః ।ఏకభక్తిర్విశిష్యతే।
ప్రియోహి జ్ఞానినోऽత్యర్థం । అహం స చ మమ ప్రియః ॥ (7-17)
3. ...... జ్ఞానీత్వాత్మైవ మే మతమ్ । (7-18)

"ఎన్నో జన్మల అనంతరం జ్ఞానము పొందిన మానవుడు నన్ను గుర్తించి నేనే సమస్తమని భావిస్తాడు. అటువంటి మహాత్ముడు లభించటం దుర్లభం. అతడు నా యందే తన మనస్సును నిలిపి, అవ్యభిచార భక్తితో నన్నే సేవిస్తాడు. అతడొక్కడే నాకు ప్రియుడు. నేనొక్కడనే అతనికి ప్రియుడను. ఇంతెందుకు? అతడే నేను; నేనే అతడు.'' అనుభవ జ్ఞానితో తనకు గల అవినావభావమైన ఆత్మీయతనూ తాదాత్మ్యాన్నీ వివరిస్తూ శ్రీకృష్ణ భగవానుడు పలికిన వాక్యములివి.



శ్రీ బాబునే పరమాత్మగా తాము గుర్తించి, శ్రీ బాబు చేతనే తాము అనుభవజ్ఞానిగా గుర్తింపును పొంది, అనన్యమైన ఆత్మీయతతో శ్రీ బాబుతో సంచరించి శ్రీ గురుసాయుజ్యం పొందిన మహాత్ములు శ్రీ కందర్ప పరశురామయ్యగారు.

శ్రీపరశురామయ్య గారు ఒక గొప్ప ఆధ్యాత్మిక కుటుంబములోని వారు. వారి తండ్రిగారైన శ్రీకందర్ప శ్రీరాములుగారు 19వ శతాబ్ది చివరి కాలంలోను 20వ శతాబ్ది ప్రారంభంలోనూ బందరులో (మచిలీపట్నం) చాలా ప్రసిద్ధి గాంచిన అద్వైత తత్త్వ సిద్ధాంతనిధి. ఆదిశంకర భగవత్పాదాచార్యులవారి శుద్ధాద్వైత సాంప్రదాయమునకు చెందినవారు. ఎందరెందరో పండితులు వారివద్ద అంతేవాసులై, అనుచరులుగా ఉండేవారు. ఇక పరశురామయ్యగారు,

ఆ తండ్రి అడుగుజాడలలోనే నడుచుకొని, ఆచరణవేదాంతిగా అతి నిరాడంబర జీవితం గడిపినవారు. పోలీస్ ఆఫీస్ మేనేజర్‌గా పనిచేసి రిటైర్ అయినారు. ఉద్యోగంలో ఉండగా కూడా, పోలీసు జవానులు మోస్తామన్నా మోయనీయక, తమ కూరగాయల సంచులు, సామాను సంచులు తామే మోసుకొన్నవారు. దొంగ అర్థరాత్రివేళ ఇంట్లో జొరబడి దోచుకుపోతుంటే చూస్తూ , గుర్తించి కూడా పడుకొని ఉండి, మర్నాడు అతనిని పిలిచి "ఎందుకురా నాయనా, అంత కష్టపడి చీకటిలో ఇల్లంతా వెదుక్కున్నావు? నన్నడిగితే నిక్షేపంగా ఏమి కావాలంటే అది ఇచ్చేవాణ్ణిగా! పోనీలే. ఈ పంచెలు కట్టుకో. ఈ డబ్బు ఉంచుకో. ఎప్పుడైనా, ఏమైనా కావాలంటే నన్నడుగు. రాత్రి జరిగిన విషయం ఎవరికీ చెప్పకు. తెలిస్తే చావగొడతారు. గుట్టు చప్పుడు గాకుండా ఊరుకో'' అని సలహా చెప్పి బట్టలు, డబ్బులు ఇచ్చి పంపిన మహనీయులు.

పరశురామయ్య గారికి యిద్దరు కూమారులు, యిద్దరు కుమార్తెలు. పెద్దకుమారుడైన శ్రీరామ ఆధ్యాత్మిక చింతన యెడల ఆసక్తి చూపలేదు. రెండవ కుమారుడు ఎంతో మేధావి. చాలా దైవ భక్తి కలిగి ఉండే వాడు. పన్నెండేళ్ళు పెరిగి, దురదృష్టవశాత్తు అతడు హఠాత్తుగా ఒక రాత్రి గతించాడు. బిగ్గరగా ఏడిస్తే ప్రక్క యిళ్ళ వాళ్ళకు నిద్రా భంగం అవుతుందని, యింట్లో ఎవరినీ దుఃఖించనీయక, పరశురామయ్య గారు తామే ఆ బాలుని స్వయంగా తీసుకొని వెళ్ళి భూస్థాపితం చేసి వచ్చారు. అంతటి స్థిత ప్రజ్ఞులు వారు. తమ రెండవ కుమారుడే శ్రీ బాబు రూపంలో మళ్ళీ తమకు లభించాడని, శ్రీ చుక్కమ్మగారు (పరశురామయ్యగారి ధర్మపత్ని) ఆనందపడే వారు.

పోలీసు మేనేజరు పదవి నుండి రిటైరైన తర్వాత యనమదుర్రులో ఉండి వ్యవసాయం చేసుకుంటూ, ఊళ్ళో అందరిచేత ' దేవుడ'ని 'గాంధీ మహాత్ముడంతటివాడు' అని అభిమానింపబడి గౌరవింపబడిన వారు. భోజన సమయానికి మాత్రం యింటికి రావటం, మిగతా రోజంతా యింటికి దగ్గరలోనే ఉన్న 'గంగరాజు పాక' లో ఉంటూ, నిరంతర తత్త్వ విచారణ చేసుకోవటం వారి దినచర్య. పరశురామయ్యగారు పన్నెండు సంవత్సరాలు శ్రీ బాల రాముని ఉపాసన చేశారు. ఆ ఉపాసన పూర్తి అయిన నాడు, "నేను నీకు రేపు దర్శనం యివ్వబోతున్నాను'' అన్నట్లు శ్రీ బాల రాముని ప్రబోధం కలిగింది.

-సశేషం

# గిరిజా విజయం

(గత సంచిక తరువాయి) -సుశీలా ప్రసాద

అది గమనించిన బ్రహ్మచారి **"వరుని కొరకా** అన్నప్పుడు నీవు విడచిన నిట్టూర్పు వలన నీ మనస్సు తెలిసింది. నీ వంటి దానిని కోరదగిన వాడెవడైనా నువ్వు కోరితే ఎందుకు కాదంటాడు? నువ్వింత కఠినమైన తపస్సు చేసి శరీరాన్ని శుష్కింప చేసుకుంటుంటే చూసి కూడా నువ్వు కోరినవాడు కనికరించలేదంటే అతడెంత వజ్ర హృదయుడో తెలుస్తోంది. ఎందుకని ఇలాగ తపస్సు చేసి కష్టాలపాలవుతావు? బ్రహ్మచారిగా నేను సంపాదించిన తపస్సులో సగభాగం నీకిస్తాను తీసుకో. నీ వరుని గురించి చెప్పు?" అన్నాడు. అలా అడిగేసరికి పార్వతి సిగ్గుపడి చెలికత్తెను చెప్పమన్నది.

"ఇంద్ర, యమ, వరుణ, కుబేరులను తిరస్కరించే కాముని అణచిన, తనతో సాటిలేని రూపంగల పినాకపాణిని పెనిమిటిగా కోరుతోంది. మునుపు మదనుడు మహేశ్వరునిపై ప్రయోగించిన బాణం కొస అయినా హర హుంకారంతో ఆయన్నంటక మరలి, దగ్ధదేహుడైన వాని బాణం ఈమె మనస్సులో లోతుగా గుచ్చుకుంది. అది మొదలీమె శివునే చింతిస్తూ విరహంతో కాలం గడుపుతున్నది. ఆయన్ను పొందటానికి మరొక ఉపాయం లేక తండ్రి అనుమతిని పొంది యీ తపోభూమిలో తపస్సు చేస్తున్నది మా స్నేహితురాలు. ఆమె స్వయంగా నాటిన గింజలు మొలకెత్తి మొక్కలై మానులై పుష్పించి ఫలించాయి గాని, ఈమె కోరిక అంకురించనే లేదు. ఇక ఫలమా ఏమని చెప్పాలి? ఎంతో ప్రార్థించిన యీమెను దుర్లభుడైన ఈశ్వరుడెప్పుడు అనుగ్రహిస్తాడో కదా!" అన్నది.

పార్వతి మనస్సును ఎరిగిస్తూ చెలికత్తె చెప్పిన మాటలకు తనలో కలిగిన ఆనందాన్ని పైకి ప్రకటించక అణచుకుంటూ బ్రహ్మచారి "ఈమె చెప్పిన మాటలు నిజమేనా?"అని పార్వతిని అడిగేసరికి "అంతా నిజమే. గొప్పస్థానం ఆక్రమించడానికి కోరుతున్నాను గాని నా తపస్సు అందుకు చాలదేమో అనిపిస్తోంది" అని పార్వతి నిరుత్సాహంగా పలికింది.

బ్రహ్మచారి వెంటనే "నాకు శివుని సంగతి బాగా తెలుసు. అమంగళాభ్యాసరతుడైన వానిని నువ్వు కోరుకోవటం నాకేం బాగాలేదు. పెళ్ళివేళ ధరించే మంగళకరమైన స్వర్ణకంకణం గల నీచేతిని పాముని

చుట్టుకున్న హరుని చేయి పట్టుకోవటం ఏమంత బాగుంటుంది? హంసలు చెక్కిన సరిగంచు పట్టు చీర కొంగుకు, నెత్తురోడుతున్న గజాసుర చర్మానికి ముడివేయటం తగునా! భవనాలలో పూలు చల్లిన ప్రదేశాలలో మసిలే నీ పారాణి పాదాలు, శ్మశాన భూమిలో తిరగటం ఎవరు ఓర్చగలరు? చందనం అలుదుకున్న నీ వక్షస్థలంపై శివుని ఎదపై ఉన్న కాటి బూడిద అంటుకుంటుంది. చక్కదనం లేని, మూడు కన్నులున్నవాడు, దెసమొల గలవాడు, ఎవరికైనా ఇంతపెట్టేందుకు కావలసిన ధనం లేనివాడు, ఒకటికాకపోతే ఒక్కటైనా లేని ఆయన్ను ఏమని పెళ్ళాడతావు? ఆపని విరమించుకో'' అంటుంటే పార్వతి ఆగ్రహం పట్టలేక పోయింది.

"నిజంగా నీవు ఈశ్వరుణ్ణి ఎరిగినవాడివి కావు. ఎందుకంటే మూఢులు, యితర జన సామాన్యం కాని ఊహించనలవికాని గొప్పవారి చరిత్రలను దూషిస్తారు. విషయాసక్తులైనవారు చందనాది అలంకారాలు కోరతారు, అవి తిరిగి తిరిగి కోరికలు పుట్టిస్తాయి. కోరిక లేని వానికి వాటితో యేమిపని? ఆయన నిర్ధనుడైనా అనంత సంపదలను ప్రసాదించ గలడు. స్మశానవాసి అయినా మంగళకరమైన శివనామం కలవాడు. ఆయన గురించి తెలిసిన వారు ఈ లోకంలో ఒక్కరైనా ఉన్నారా? విశ్వమూర్తి అయిన శివుని శరీరం నగలతోనైనా, పాములతోనైనా, గజచర్మముతోనైనా, పట్టుబట్టలతోనైనా, పుత్తెలతోనైనా, బాలచంద్రునితోనైనా సమానంగానే ప్రకాశిస్తుంటుంది. ఆయన అనంత విభవం నీకేం తెలుస్తుంది? సరే నువ్వు చెప్పినట్లు ఆయన అయోగ్యతగల గుణాలు కలవాడే అనుకో అయినా నా మనస్సు అతనియందే లగ్నమై ఉంది. నేను వాని ప్రేమనే కోరుతున్నాను. నా ఇష్టానికి అడ్డేముంది గనుక'' ఇలా అంటూ చెలికత్తెతో "చెలీ! ఇతడేదో ఇంకా చెప్పబోతున్నాడు గాని ఆపెయ్యి. గొప్పవారిని, మహాత్ములను దూషిస్తే అవి విన్నవారికి కూడా పాపాలు చుట్టుకుంటాయి ముందు నువ్వీయనను వెళ్ళగొట్టకపోతే, నేనే పోతాను'' అంటూ పట్టరాని కోపంతో పార్వతీదేవి లేచిపోబోయేసరికి ................

అప్పుడు పరమేశ్వరుడు నిజరూపంలో సాక్షాత్కారించి ఆమె చేతిని పట్టుకున్నాడు. "ఓ పార్వతీ! నీ తపస్సుచేత కట్టబడి నీదాసుడనైనాను'' అన్నాడు. ఆవేళ దేవగణమంతా సంతోషంతో పుష్పవర్షం కురిపించింది. లోకాలన్నీ పరమశాంతిని పొందాయి!!

(శ్రీకాళిదాస కృత 'కుమార సంభవమ్' ఆధారం)

# శ్రీశ్రీశ్రీ హనుమత్‌కాళీ వర ప్రసాద బాబు
# ఆవాస గురుకులం

## అతి తక్కువ ఫీజులతో, ఉత్తమ విద్యాబోధనతో నడుపబడుతున్న
## (ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యా సంస్థ)
## అడ్మిషన్లు జరుగుచున్నవి

**త్వరపడండి!** **కొద్ది సీట్లు మాత్రమే ఉన్నాయి!!**

విద్య అంటే విజ్ఞానము. అది అమ్మబడేది కాదు. కొనబడేది కాదు. అది అనుభవంతో కూడిన అధ్యాపకులు ద్వారా అందింపబడేది. నర్సరీ నుండి ఎల్.కెజితో సహా టెన్త్ క్లాస్ వరకు తెలుగు,ఇంగ్లీషు మీడియంలలో శిక్షణ ఇవ్వబడుతోంది.

ప్రత్యేకతలు :

- ప్రశాంత వాతావరణము, ఆధ్యాత్మిక శిక్షణ
- యోగాసనాలు
- క్రమశిక్షణ, సత్ ప్రవర్తన
- అగ్రగామి టీచర్లచే బోధన
- రెసిడెన్షియల్ ట్యూటర్ల పర్యవేక్షణలో చదివించటం
- బాలబాలికలకు ప్రత్యేక హాస్టలు వసతి
- వీక్లీ టెస్ట్‌లు, డైలీ అస్సైన్‌మెంట్లు
- కంప్యూటర్ ఎడ్యుకేషన్
- డే స్కాలర్స్‌కి బస్సు సౌకర్యము
- సంస్కృత, హిందీ పరీక్షలకు శిక్షణ
- వైద్యసదుపాయం
- సెమి రెసిడెన్షియల్ సౌకర్యము కల్పించబడుతుంది.

గమనిక :

1. ఈ పాఠశాల యందు కనీసము 3సంవత్సరములు చదివి, గణనీయమైన మార్కులను సాధించిన పేదవిద్యార్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యము కలదు.
2. స్కూలు 6-6-2011న తెరువబడును. వివరములకు కరెస్పాండెంట్‌గారిని స్వయంగాగాని, ఫోన్‌ద్వారాగాని సంప్రదించవచ్చు. లేదా వారికి వివరముల కొరకు వ్రాయండి.

**డా॥కె.వి. ఆర్ రమణ** M.Sc., Ph.D.
కరెస్పాండెంట్ ఫోన్ నెం. (0863)2594211(ఆ)
2293824(ఇ) మొబైల్:9393220400

# కనువిప్పు

-పరాశర ప్రసాద్

మహాత్ముల క్షమాగుణం, ప్రేమ, ఆదరణ ఎవరైనా అంచనా వేయ గలుగుతారా? ప్రశ్నించే వారు శ్రీబాబూజీ మహరాజ్. చీదరించుకునే వారిని ఆదరించే తత్త్వం వారిది. కారణం వారి మనస్సు సదా ఆత్మతో రమిస్తూ ఆనంద సాగరంలో ఓలలాడుతూ ఉంటుంది. ఆ సాగరంలో అలలూ లేవు. కెరటాలూ లేవు. అంతా ప్రశాంతతే. అందువలననే కదిలికలు లేని వాడు మహాత్ముడు. కదలికలతోకూడిన మనస్సు గలబివాడు జీవుడు.

ఏకనాథ్ ఆరోజు భారతంలోని శాంతి ఘట్టం ధర్మరాజు గురించి వివరించారు. 'ధర్మరాజు కోపం అంటే ఏమిటో ఎరుగని వాడు. ఎంత ధన్యుడు! ఆ స్థితిని సాధించని జన్మ నిరర్ధకం' అని భావిస్తూ గంగానదీ స్నానానికి బయలుదేరారు ఏకనాథ్.

స్నానం ముగించుకుని గురుధ్యానం చేసుకుంటూ వస్తున్నారు. అనుకోకుండా ఆ వీధిలో మేడమీద నుంచి ఒక వ్యక్తి ఏకనాథ్‌మీద పడేటట్లుగా ఉమ్మివేశాడు. స్వామి తనమీద పడిన ఉమ్మి చూసుకుని, పైకి కూడా చూడకుండా మరల గంగా స్నానానికి వెళ్ళారు. అలా స్వామివారు ఆ వ్యక్తి ఉమ్మివేయుటం మరల స్నానం చేసి రావటం ఇలా అనేక పర్యాయాలు జరిగింది.

చివరికి ఆ వ్యక్తి పశ్చాత్తాప పడి, స్వామివారి పాదాలపై పడి క్షమించమని ప్రాధేయపడ్డాడు. దానికి నాథ్ చిరునవ్వు నవ్వి, ఈరోజు ఈ పర్వదినాన నీవు చేసిన చర్యవలన నేను 108సార్లు గంగా స్నానం చేసే భాగ్య కలిగినందుకు సంతోషిస్తున్నాను'' అని సమాధానం చెప్పారు. అంతేకాక 'భగవంతుడు నిన్ను రక్షించుగాక!' అని ఆశీర్వదించారు. ఇటువంటి సంఘటనలు మహాత్ముల జీవితంలో అనేకం ఉంటాయి. అది వారి క్షమాగుణానికి నిదర్శనం.

శ్రీబాబూజీ మహరాజ్ గుండుగొలను గ్రామంలో చిరంజీవిరాజుగారు, శేషగిరిరావుగార్లతో కలసి అలా వ్యాహ్యాళికి వెళ్తూ ఉండేవారు. అనుదినము అలా వారు వెళ్తుండగా, వారు వెళ్ళే దారిలో ఒక గృహంలో ఉండే వ్యక్తి , వారు వచ్చే సమయాన్ని గుర్తించి రోడ్డు మీదకి చిత్తు కాగితాలుగాని, ఇల్లు ఊడ్చిన చెత్తగాని, లేక నీరు పుక్కిళించి ఉమ్మివేయటంగాని చేసేవాడు.

దీనిని గమనించిన చిరంజీవిరాజుగారు ఎలాగైనా ఆవ్యక్తికి తగిన బుద్ధి చెప్పాలని శ్రీబాబూజీ మహరాజ్‌వారి అనుమతి కోరారు. శ్రీగురుదేవులు సమాధానంగా చిరంజీవిరాజుగారిని "తొందరపడవద్దు. ఆ వ్యక్తి ఏదో అజ్ఞానంలో చేస్తున్నాడు. జగజ్జనని చూసుకుంటుంది మనకెందుకు లేవయ్యా!" అని నివారించారు.

మరునాడు గురుదేవులు అదే మార్గంలో వ్యాహ్యాళికి వస్తుంటే ఆ వ్యక్తి కానరాలేదు. శ్రీబాబూజీ మహరాజ్ చిరంజీవిరాజుగారిని, శేషగిరిరావుగారిని "ఇక్కడే వేచి ఉండండి" అని చెప్పి ఆ వ్యక్తి యింట్లోకి వెళ్ళేసరికి, ఆవ్యక్తి మంచంలో నీరసంగా పడుకుని ఉన్నాడు. పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. ఆ వ్యక్తి మంచం చుట్టూ బంధువులంతా నిలుచుని ఉన్నారు. శ్రీబాబూజీ మహరాజ్‌ను చూడగానే ఆ వ్యక్తి ఎలాగో ఓపిక తెచ్చుకుని రెండు చేతులూ ఎత్తి నమస్కరించి, క్షమించమని ప్రార్థించాడు. ఇంట్లోని వారంతా గురుదేవుల పాదాలపై పడి రక్షించమని ప్రార్థించారు.

ఆ వ్యక్తికి ఎడతెరిపి లేకుండా 10 లేక 15 విరోచనాలు అయ్యాయి. కుటుంబ సభ్యులంతా కంగారు పడ్డారు. శ్రీగురుదేవులు మాట్లాడుతూ "డాక్టరు దగ్గరకి తీసుకెళ్ళండి. తగ్గిపోతుందిలే" అని హామీ ఇచ్చారు.

మహాత్ములు దూషణ భూషణలకు అతీతులు. **సర్వత్ర సమ బుద్ధయః** అంటే ఇంతకన్న ప్రత్యక్ష నిదర్శనం ఏం కావాలి?

పై సంఘటనలు శ్రీబాబూజీ మహరాజ్ స్వయంగా భక్తులకు తెలియజేస్తూ నా బాల్యంలో సంఘటనలను తెలుసుకుంటే కళ్ళనీళ్ళు పెట్టుకుంటారు అన్నారు. ఆచారాల పేరుతో నాకు త్రాగటానికి నీళ్ళు చెంబుతో ఎత్తి నా దోసిళ్ళలో పోసేవారు. అంతేకాదు ఇంట్లోని వారంతా భోజనం చేసిన తరువాత నాకు ఒక్కడికి విడిగా వరండాలో ఆకులో పెట్టేవారు. విస్తరి తగిలితే ఎక్కడ అంటు అవుతుందోనని అన్నం కూరలు, పచ్చడి ఎత్తునుంచి విస్తరిలో పడవేసేవారు. పసుపు నీళ్ళు చల్లి తరువాత శుభ్రపరచేవాడిని. నాకు విశ్రమించటానికి గోనె పట్టాలు ఇచ్చేవారు. ఇటుక రాయి దిండుగా ఉపయోగించే వాడిని. ఆనాటి జీవితం అది. నాలో అసంతృప్తి లేదు. ఈర్ష్యలేదు. సాధకులు అలాగే ఉండాలి. ఏది భగవానుడు ప్రసాదిస్తే దానిని స్వీకరించాలి అన్నారు శ్రీబాబుజీ మహరాజ్.

*

# శాంతి ధామం - ఆశ్రమం

- జగదీష్

ఆశ్రమ వాసము, ఆశ్రమసేవ లభించాలంటే ఎన్నో జన్మల పుణ్యఫలం రాసీభూతమైనప్పుడే లభిస్తుందని శ్రీగురుదేవులు చెబుతూ ఉండేవారు. ప్రాపంచిక వ్యవహారాలలో తలదూర్చి తలమునకలై ఎంత శ్రమించినా, కుటుంబ సభ్యులుగాని, బంధుమిత్రాదులు గాని ఏమీ వ్యాఖ్యానించికపోవచ్చు. కాని ఏదైనా ఆశ్రమ కార్యక్రమంలో పాల్గొనటానికి ప్రయత్నం చేసే వ్యక్తిని మాత్రం "ఇప్పటి నుంచి ఎందుకు? వయస్సు వచ్చాక ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొనవచ్చుకదా! అయినా వయస్సులో ఉండగానే సన్యాసం పుచ్చుకుంటావా ఏమిటి!" అని అనకుండా ఉండగల్గినవాళ్ళు ఎంతమంది?

ఆశ్రమవాసము, ఆశ్రమ సేవ ఎవరిని వారు ఉద్ధరించుకోవటానికేగాని మరేమి కాదు. మన జీవిత పరమార్థం ఏమిటో తెలుసుకోవటానికి ఇది చక్కని అవకాశం. అటువంటి సదవకాశాన్ని హైద్రాబాద్ బ్రాంచి కార్యకర్తలు కలుగజేశారు. ఈ సదావకాశాన్ని జారవిడుచుకోకుండా ఆసక్తి ఉన్నవారు ఎవరైనా తమ అభీష్టాన్ని హైద్రాబాద్ కార్యకర్తలకు తెలియజేస్తే తగిన సమయంలో అవకాశం కల్పించ బడుతుంది.

ఆశ్రమవాసము, ఆశ్రమసేవ చేయగోరేవారు ఆశ్రమంలో బసచేసి, నిత్యకార్యక్రమాలు నిర్వహించాలి. అనుదినము ప్రాతఃకాల సుప్రభాతము, ప్రార్థన, ధ్యానము, సంకీర్తన, ఆలయ దర్శనము, మధ్యాహ్న సంకీర్తన, పురాణ పఠనము, సాయం సమయ ప్రార్థన, సత్సంగము, ధ్యానము మొదలైన కార్యక్రమాలు నిర్వహించాలి. ఆశ్రమ దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ సందర్శనం చేయించి, ఆశ్రమ ఆశయాలను వివరించి చెప్పాలి. వచ్చినవారికి మీ శక్తి కొలది ప్రసాదాన్ని వినియోగించి సేవించుకోవచ్చు.

అంతేకాకుండా హైద్రాబాద్ శాఖలో ఆశ్రమసేవకి అంకితమైనవారికి అనుదినము శ్రీసద్గురుదేవులకు స్వయంగా పూజ చేసుకునే అవకాశం కల్పించబడింది. ఆశ్రమవాసము చేస్తూ, ఆశ్రమసేవ చేసుకునే కుటుంబములవారు బస చేయటానికి తగిన సదుపాయం ఉంది. వంటపాత్రలు, వంటగ్యాసు, ఇతర అవసర సామాగ్రిని కూడా వినియోగించు కోవటానికి ఏర్పాట్లు చేయబడ్డాయి.

పూర్ణిమ, శ్రీగురుదశమి మరి యితర పర్వదినాలలో మరియు శ్రీమాతాజీవారు ఆశ్రమానికి విచ్చేసిన సమయాలలో శ్రీసద్గురుపాదపూజ స్వయంగా చేసుకునే అవకాశం కల్పించబడింది. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించే సమయంలో విచ్చేసిన భక్తులకు వసతి సౌకర్యం కల్పించటం, ప్రసాదం వినియోగం చేసే భాగ్యాన్ని పొందే సావకాశము ఉంటుంది.

శ్రీబాబూజీ మహరాజ్ భక్తులకు బోధ చేస్తూ "ఆశ్రమంలో భక్తులకు చేసిన సేవ భగవంతునికి చేసిన సేవ కన్న మిన్న" అనేవారు. ఆశ్రమసేవలో పాల్గొని శాంతిని పొందుదురుగాక!

**కొందరు పల్లె పడుచులు సంతనుంచి యింటికి పోతూ దారిలో పొద్దుగూకి వడగళ్ళవాన వస్తున్నందున సమీపంలోని ఒక పువ్వులమ్మే వ్యక్తి యింటికి చేరుకున్నారు. ఆవర్తకుడు దయతలచి వారిని తాను పువ్వులు నిలువ ఉంచిన వసారా గదిలో ఆ రాత్రి పడుకోమన్నాడు. ఆ గదిలో పరిమళాలు విరజిమ్మే పువ్వులు తట్టల కొద్దీ ఉండటతో ఘుమఘుమ సువాసన వీచసాగింది. కాని ఆ సువాసన పల్లెపడుచులకు దుర్భరమై వారికి, కాస్త కునుకు కూడా పట్టనివ్వలేదు. చివరకు అందులో ఒకతె అందుకు తరుణోపాయాన్ని కనుగొంది. తక్కినవారితో ఆమె "ఖాళీగా ఉన్న మన చేపల బుట్టల మీద కొంచెం నీళ్ళు జల్లి వాటిని మన వద్ద ఉంచుకొందాం. మనకు నిద్ర పట్టకుండా చేస్తున్న యీ పూల వాసనకు యిదే విరుగుడు" అన్నది. పల్లెపడుచులంతా ఆ యోచనకు సంతోషించి, అలాగే చేశారు. అరగంటలో వారంతా గుర్రు పెట్టనారంభించారు.**

**అభ్యాసం ఎంత గొప్పదో ! సాంసారిక దుశ్చింతలలో పుట్టపెరిగి, పేడపురుగు మాదిరి ఆ మాలిన్యంలోనే జీవించటానికి అలవాటుపడ్డ లౌకికుని గతీ యిలాటిదే. పవిత్రత, వైరాగ్యము, త్యాగము ప్రకాశించేచోట అలాటి వ్యక్తి నిమిషమైనా మనలేడు కదా! అలాటి వాతావరణంలో అతగాడు ఉక్కిరిబిక్కిరి అయిపోతాడు కదా!**

**- శ్రీరామకృష్ణులు**

## మౌనధ్యాన సప్తాహ శిబిరం

-రమణ ప్రసాద్

ఆకాశమునకు ఏది కాలము? అని చెప్తూ ఒక సమయంలో - ఆయన ప్రళయంలో ఆనంద సాగరం మీద పవళించాడు. ఆ ఆనందసాగరములో హరిని, లక్ష్మీదేవిని ఊహించుకుంటాము. అది భక్త హృదయం కాకూడదా? మన హృదయం అనే ఆనంద సముద్రంలో ఆయన పవళించలేడా? ఇలా అనుకుంటే ఆనందం! లేకపోతే దౌర్భాగ్యం!

కాబట్టి భక్తహృదయం అతి లోతైనది (deepest). అని తెలుసుకోవటం హరిహరాదులకు కూడా తరం కాదు. అది అనుభవించిన భక్తునికే తెలుస్తుంది.

**వటపత్రశాయియై పసిబాలునటు తోచు**

చిన్నఆకు మీద పడుకుని ఉన్నాడు బుల్లోడు, బుజ్జోడు, అమాయకుడు. మనం కూడా మాయ లేకుండా ఉండాలి. మనకు పుట్టిన పిల్లలు కొన్నాళ్ళు మన దగ్గరే ఉంటారు. తరువాత మనల్ని వదిలి ఎక్కడెక్కడికో వెళ్తారు. కానీ గురుదేవులు మనల్ని ఎప్పటికీ వదలరు ఆనాటి నుంచి యీనాటి వరకు. ఆ వటపత్రశాయి ముద్రను ఉపాసన చేయాలి.

భక్తులు నా పాదాలు వదిలి పెట్టరు. దాని రుచి ఏమిటో తెలుసుకోవాలని తన పాదాలను నోట్లో పెట్టుకున్నాడు. అర్థవంతంగా తత్త్వాన్ని బోధిస్తూ......

ఆయన బాలుడా? పరమాత్ముడా? భుజగశయనుడైన పురుషోత్తముడా? అది పత్రమా? భుజంగమా? ఒక్కసారి మనస్సులో ప్రశ్నించుకోండి తానే మిగులుతుంది. ఎందుకంటే చూడటానికి మూలం నువ్వు.

ఆ పరమాత్మ తత్త్వం త్రికాలాలో ప్రకాశిస్తోంది. అంటే జాగ్రత్స్వప్న సుషుప్తులలో ప్రకాశిస్తోంది. భూత భవిష్యద్వర్తమానాలలో ప్రకాశిస్తోంది. మనం అనుభవిస్తున్న వర్తమానమే భూతమవుతుంది. మననం చేసుకోకుండా ఉన్నప్పుడు అది భవిష్యత్తు అవుతుంది. త్రికాలాలలో ఏద్దైతే ప్రకాశిస్తోందో అది అజ్ఞానమనే అంధకారాన్ని హరింపజేస్తుంది. అక్కడ మన గురుదేవుడు ఆనంద సముద్రంలో ఓలలాడుతూ ఉంటాడు. మనందరినీ కూడా ఆ ఆనంద సాగరంలో ముంచితేలుస్తాడు.

ఢిల్లీలో ఒక ఆయన అడిగాడు కృష్ణుడు నీలంగా ఎందుకు ఉంటాడు? అని. రాధ కృష్ణుణ్ణి "నువ్వు నల్లగా ఉన్నావు" అంటే కృష్ణుడు యశోదమ్మతో

"చూడమ్మా! నేను నల్లగా ఉన్నానట" అంటాడు. "రాధకు నీ రంగు పూసేయి" అంటుంది యశోదమ్మ. కృష్ణుడు రాధకు తన రంగు పూశాడు.

"అంటే కృష్ణుడు అనంతంగా ఉన్నాడు అని దాని అర్థం" అని నేను ఆయనకి సమాధానం చెప్పాను. "ఆకాశం మీకు నీలంగా కనిపించటం లేదూ? అలాగే కృష్ణుణ్ణి ఉపాధిగా చూస్తే నీలవర్ణంగా కనిపిస్తాడు. ఆయన ఒక రంగుకి చెందినవాడు మాత్రమే కాదు. అన్ని రంగులనూ ధరించగలడు. వదలగలడు. అలాగే మనం గురునాథునిలో ఉన్నాము. ఆనంద సాగరంలో ఉన్నాం. ఆ ఆనందం మన స్వంత ప్రాపర్టీ. ప్రపంచ విషయాలలో ఆనందం లేదు. అట్టి ఆనంద స్థితిని పొందటానికి చేసే ప్రయత్నమే ధ్యానం.

కానీ కొన్ని do's and don'ts ఉంటాయి. వాటిని చేస్తే ధ్యానం మన వెంటపడి వస్తుంది. చెట్టు బీజం నుంచి వచ్చింది. కాని అది మనకు కనిపించదు. అంటే చెట్టు ఉంటే బీజం కనిపించదు. కాని బీజం ఉంటేనే చెట్టు ఉంటుంది. అటువంటి వైభవాన్ని వదిలి భవంలో పడిపోతున్నాము.

ఎవరు బాబు? గురుదేవులు అనంత సృష్టిలో ఉన్నారు. కాబట్టి శ్రీగురుదేవులు మనందరికి సాధనయందు అటువంటి సిద్ధిని, శక్తిని, భక్తిని, అఖండ భక్తి, జ్ఞాన వైరాగ్యములను ప్రసాదించెదరు గాక! సుఖీభవ! సుఖీభవ!

## శ్రీమాతాజీవారి విదేశ పర్యటన

శ్రీమాతాజీ మే 23వ తేదీన చెన్నై నుండి బయలుదేరి అమెరికాకు వెళ్ళారు. అక్కడ అట్లాంటాలో మే 27 నుండి 30వ తేదీ వరకు శ్రీ డి. శ్రీనివాస్‌గారింట్లో సత్సంగ సమావేశాలు జరుగుతాయి. ఈ సమావేశాలకు అమెరికాలో వివిధ ప్రాంతాల నుండి భక్తులు వచ్చి హాజరవుతారు. శ్రీమాతాజీవారు తిరిగి జులై 13న స్వదేశమునకు తిరిగి వస్తారు.




(గత సంచిక తరువాయి) -రమణ ప్రసాద్

కాని కాలయవనుడు ఆర్యావర్తంపైకి యుద్ధానికి రావటంతో కొత్త పరిస్థితి ఎదురైంది. ధర్మ, న్యాయం మధుర పక్షాన్నే ఉన్నాయి. కాని.... కాలయవనుని రాకతో ఆర్యావర్తంలో రేగిన ఆంతరిక కలహాలు సింధుదేశం నుండి వచ్చిన ఒక పరదేశి హస్తక్షేపానికి సమానమైనాయి. ఈ విదేశపు ఆక్రమకారులు ఆంతరిక కలహాలు రేపే వారితో చేతులు కలిపితే మధుర గణతంత్రమే కాదు... మగధ సామ్రాజ్యానికి కూడా ముప్పు వాటిల్లుతుంది. స్వార్థంతో, క్రోధంతో అంధుడైన జరాసంధునిలో ఉన్నది కేవలం ప్రతీకార భావన మాత్రమే... కృష్ణుని ముందు అనంత భవిష్యద్భావన ఒక శుభోదయం.

ప్రచండ సంకటం ఎదురైంది. మధురను మూడు దిశలనుండి ముట్టడించారు... ఉగ్రసేనుడు వసుదేవుల బుద్ధికుశలత పని చేయలేదు. సంప్రదింపులకోసం సమావేశమైన సభలో వికద్రుడనే వరిష్ఠ యాదవుడు హెచ్చు స్వరంతో ఇలా అన్నాడు "కృష్ణా!... జరాసంధుని ఆక్రమణముందు మధుర నిలబడటం అసాధ్యం అనిపిస్తోంది..."

"నా మర్యాద నాకు తెలుసు! నేను మీ ఆశీర్వదము మార్గదర్శనము అర్థిస్తున్నాను" అన్నాడు కృష్ణుడు స్థిరచిత్తుడై.

"కాలయవనుడు దుర్ధర్షుడు. జరాసంధుడు వైరాగ్నితో అంధుడైనాడు..." అని పరిస్థితిని ఆకళింపు చేసుకొన్న వికద్రుడు ఇలా అన్నాడు "కంసునితో అధిగ్రస్థమైన మధురకు ముక్తిని ప్రసాదించావు... మృతప్రాయమైన గణతంత్రాన్ని పునర్జీవితం చేశావు. నీ ఈ అనన్య యోగదానంతో ఒక్క మధుర మాత్రమే కాదు సమస్త ఆర్యావర్తము ఋణపడి ఉంటుంది కృష్ణా... కాని... కాని..." "ఏమిటి తండ్రీ ఎందుకు ఆగారు...? నిశ్శంకోచంగా చెప్పండి" అన్నాడు కృష్ణుడు ధైర్యం చెబుతూ.

"కృష్ణా!" వికద్రుడు ఆగి ఆగి అన్నాడు. జరాసంధుని వైరం మధురతో కాదు..."

"కృష్ణునితో" అన్నాడు వాక్యాన్ని పూర్తి చేస్తూ కృష్ణుడు. వికద్రుడు ఏమీ మారు మాట చెప్పలేక పోయాడు.

ఏం చేయాలో మీరు చెప్పండి తండ్రీ! మధుర గణతంత్రాన్ని రక్షించటం కోసం ఈ కృష్ణుడు ఏ బలిదానం చేయటానికైనా సిద్ధంగా ఉన్నాడు... నిస్సంకోచంగా చెప్పండి..."

"మధురను విడిచి నువ్వు ఆర్యావర్తంలో ఎవ్వరికీ తెలియని చోటికి వెళ్ళు. అప్పుడు జరాసంధకాలయవనులు మధురను ఆక్రమించుకోవటం విరమించి వారు నీ వెంట పడతారు" అన్నాడు వికద్రుడు తన మాటను పూర్తి చేస్తూ.

యాదవ సభలో నిశ్శబ్దం అలముకొంది.

ఉద్ధవుని కనులనిండా నీరు... అక్కడి ప్రదేశమంతా స్థాణువైంది. ఏ మధురను కృష్ణుడు పునర్జీవితం చేశాడో, ఆ మధురయే తన సంరక్షణ కోసం కృష్ణుణ్ణి దేశబహిష్కారం కోరుతుంది!

"అయ్యా మీరు చెప్పేది నిజమే" కృష్ణుడు సమస్త యాదవ సభకు చేతులు జోడించి నతమస్తకుడై అన్నాడు "ఒక వ్యక్తిని అపేక్ష చేయటం కన్న గణతంత్రమే గొప్పది అని నేనే కంసునితో అన్నాను. నేను చెప్పినది జరిగిన దానికి ఇంత త్వరలో నేనే ఆచరణలో పెట్ట వలసి వస్తుందని అనుకోలేదు. ఇది నా అహోభాగ్యం. నేను, అన్నగారు ఇంకా కొంతమంది యాదవ అనుయాయిలతో కలిసి ప్రాతఃకాలంలోనే మధురను విడిచి వెళతాం... మనం మూడు దిశలనుంచి ముట్టడించ బడి ఉన్నాం. కాని పశ్చిమ మార్గం తెరిచే ఉంది! నేను ఆ మార్గంగుండా వెళతాను. నన్ను చూసి కాలయవన జరాసంధుల సేన నన్ను పారిపోతూ ఉండగ చూసేటట్లుగా వెళతాను..."

కృష్ణుడు తన మాటలను పూర్తిచేసి యాదవులందరి వైపు చూశాడు. యాదవుల ముఖాలు నల్లగా మాడి ఉన్నాయి... అందరూ తలలు దించుకున్నారు.

మర్నాడు ప్రాతఃకాలాన్నే పశ్చిమద్వారం గుండా కృష్ణుడు మధురను విడిచాడు. పారిపోతున్న కృష్ణుణ్ణి చూసిన జరాసంధుని సేన జయఘోషలు చేసింది. కాలయవనుడు కృష్ణుణ్ణి వెంబడించాడు. కృష్ణుడు చిరునవ్వు నవ్వాడు. తన గతిని త్వరితం చేశాడు... మధురను సర్వనాశనం నుండి కాపాడాడు.

పశ్చిమ ఆర్యావర్తంయొక్క రోమరోమం ఒక వింత ప్రసన్నతతో

అలరారింది... ద్వారక దిశ అంతా ప్రకాశమై పోయింది....

జరిగిన ఆ విషమ ఘడియ స్మరణకు వచ్చిన ఉద్ధవుడు విచలితుడైనాడు. ఎంతోసేపుగా తాను ఆ శిలపైన కర్తవ్యమూఢుడై కూర్చొని ఉన్నాడు. ఇంక కొన్ని క్షణాలలో తాను రాధను కలవబోతున్నాడు. ఇక ఒకే కార్యం మిగిలి ఉంది.... కృష్ణుని దేహ విలయం గురించిన సమాచారం రాధకు అందచేయటం... అది విని రాధ సమగ్ర అతీతంనుండి అలిప్తమవుతుంది. ఇంక అతీతంతో ఇక ఏ బంధమూ ఉండదు.

ఉద్ధవుడు నెమ్మదిగా లేచి కాళింది ప్రవాహంలో కాళ్ళు పెట్టాడు. ఆ నీటి చల్లదనం వల్ల అతనికి శాంతి లభించింది... ప్రవాహ మాధ్యంలోకి వెళ్ళి ముఖం, చేతులు కడుకొన్నాడు. జలాన్ని ఆచమనం చేశాడు... సూర్యునికి వందనం చేసి ముందుకు నడిచాడు.. గోకులం దిశగా...!

'ఎవరి ఇల్లు వెతుకుతున్నారు మహాశయా?''

ఉద్ధవుడు చకితుడైనాడు. తను గోకులంలోకి ప్రవేశించాడన్నమాట!... గోధూళి సమయం అయింది. మరలి వస్తున్న ఆవుల గంటల ధ్వనులు, వాటి అరుపులు, దూడల అరుపులతో వీధులు ప్రతిధ్వనిస్తున్నాయి. పెద్దపెద్దగా అడుగులు వేస్తూ నడుస్తున్న ఉద్ధవుడి దృష్టి వీటిని చూస్తున్నా చూడనట్లే ఉంది... రాధ ఇల్లు వెతుకుతూ వెళుతున్నాడు....

'ఎవరి ఇల్లు వెతుకుతున్నారు తమరు?'' అని తిరిగి ప్రశ్నించాడు. ఆ ప్రశ్న అడిగిన గోపాలుడు అతని ముందు వచ్చి నుంచున్నాడు. ఉద్ధవుడు అతనివైపు దృష్టి సారించాడు. అతడు పూర్తిగ అపరిచితుడు. అటూ ఇటూ ఉన్న గోపాలకులవైపు చూశాడు. వారిలోనూ పరిచయులెవ్వరూ లేరు. ఇప్పుడు అతడు గోకులంలో ఒక అపరిచితుడు.

ఉద్ధవుడు మాట్లాడటానికి ప్రయత్నించాడు - "గోకులానికి అపరిచితుణ్ణి కాదు! మీరు అన్యథా తలచవద్దు. నేను నా ఇంటిని వెతుకుంటున్నాను. దొరుకుతుంది!''

-సశేషం

---

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

# వార్తలు విశేషాలు




శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం, గుంటూరులో మే.12 నుండి 17 వ తేదీ వరకు జరిగినన బ్రహ్మోత్సవాలలో మే 16 వ తేదీన శ్రీ మాతాజీ వారు పాల్గొన్న దృశ్యం.




మే 17 మాఘపూర్ణిమనాడు శ్రీయుతులు దాసరి చిన్న బ్రహ్మయ్య గారు వారి కుటుంబ సభ్యులు మరియు శ్రీ P.V.S రామకృష్ణ, I.P.S, గారు తమ కుమారుని వివాహానంతరం శ్రీ సద్గురు పాద పూజ చేసికొంటున్న దృశ్యం.



ఏప్రియల్ 15 వ తేదీన శ్రీ మాతాజీవారు పెదనింద్రకొలను ఆశ్రమానికివెళ్ళారు. అక్కడ కార్యక్రమాలలో పాల్గొని భక్తులతోముచ్చటిస్తున్న దృశ్యం




మే 8 వ తేదీ శ్రీ శంకరజయంతి సందర్భంగా , శ్రీ వెంకటరత్నంగారు వారి కుటుంబ సభ్యులు; శ్రీసద్గురుమూర్తి 16వ వార్షికోత్సవ సందర్భంగా దాసరి ఆనంద్‌గారు వారి కుటుంబ సభ్యులు శ్రీ సద్గురు దేవులకు పాదపూజ చేసికొంటున్న దృశ్యం



మే 16 వ తేదీన శ్రీ ఏ.వి రావు గారు వారి సతీమణి ప్రభావతమ్మగారి 65వ వివాహదినోత్సవ సందర్భంగా శ్రీ సద్గురు పాదపూజ చేసికొన్నారు. వారి కుటుంబ సభ్యులు శ్రీ ఏ.వీ రావు దంపతులకు పాదపూజ చేసికొన్న దృశ్యం.